**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 62, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 29, 2026 వెల: 5 రూ/.



- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates

Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# గేర్ మార్చిందిగా!




**- వేగం పెంచిన కారు పార్టీ - నిత్యం ప్రజల్లో ఉండేలా ప్లాన్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీఆర్ఎస్ స్పీడ్ పెంచింది. ఎన్నికల సమయంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తన రాజకీయ పోరాట వేగాన్ని గణనీయంగా పెంచింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను నెరవేర్చలేదనే ప్రధాన అజెండాతో బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు తెలియజేసింది. ఏదో ఒక ఆందోళన చేస్తూ ప్రతి రోజూ ప్రభుత్వం పంటి కింద రాయిలా తయారయింది. జనం వాయిస్ ను రైజ్ అయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తుంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై బీఆర్ఎస్ ఆందోళనకు దిగుతుంది. వరసగా బీఆర్ఎస్ చేస్తున్న ఆందోళనలతో కొంత ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లయింది.

## నిత్యం జనంలోనే..

భూ కబ్జాలు, 22ఏ వివాదం, హైడ్రా కూల్చివేతలు, తాజాగా విద్యార్థుల పక్షాన పోరుబాట పట్టింది. పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ నిలబడింది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు నిత్యం జనంలోనే ఉంటున్నారు. తొలుత వెయ్యి రోజుల పాలనపై 'పోరుబాట'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ వైఫల్యాలపై అధికారికంగా ఛార్జ్‌షీట్ విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "బాకీ కార్డ్స్" ప్రచారాన్ని తిరిగి ప్రారంభించారు.వినూత్న నిరసనల షెడ్యూల్ లు రం రోజుల పాటు వివిధ వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

## వరస ఆందోళనలతో..

సెప్టెంబర్ 3న వ్యవసాయం, రుణమాఫీ, ఉచిత విద్యుత్ సమస్యలపై రైతు సమావేశాలు నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 4న మహిళా సమస్యలు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 5న రూ. 12,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ క్యాలెండర్ ఆలస్యంపై భారీ ర్యాలీలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 6న నగరంలో తాగునీరు, మౌలిక సదుపాయాల కొరతపై ఆటోలతో నిరసన తెలియజేయనుంది.

సెప్టెంబర్ 7, 8 తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాల సమర్పించనుంది. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 22ఏ నిషేధిత జాబితా సమస్య వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై హరీష్ రావు న్యాయ విచారణ కోరుతూ సభను స్తంభింపజేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు .రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మరియు వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చైతన్యపరుస్తూ తన రాజకీయ వేగాన్ని అంచెలంచెలుగా పెంచుతోంది.

# రక్షా బంధన్ వేడుకల్లో ప్రధాని

**- పిల్లలతో రాఖీ కట్టించుకున్న మోదీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిల్లలతో కలిసి రక్షాబంధన్ పండుగను జరుపుకున్నారు. ఆయన వారితో రాఖీలు కూడా కట్టించుకున్నారు. ఆయన వారితో ముచ్చటించి, రక్షాబంధన్ ఆనందాన్ని పంచుకున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అనేకమంది పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలు, ఫోటోలను ప్రధాని మోదీ తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకున్నారు. ప్రధాని మోదీ పిల్లల మధ్య చాలా సౌకర్యవంతంగా, సంతోషంగా కనిపించారు. రక్షాబంధన్ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని తన శుభాకాంక్షలు కూడా తెలిపారు. రక్షాబంధన్ అన్నదమ్ముల, అక్కాచెల్లెళ్ల మధ్య

2లో..

## నియోజకవర్గాల వారీగా
# విజన్ ప్లాన్

**- స్థానిక వనరుల లభ్యతపై సీఎం చంద్రబాబు ఆదేశాలు**

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్‌తో సీఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని

2లో..

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

**- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సీఎం చంద్రబాబు**



అమరావతి (ప్రశ్న న్యూస్) మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్

2లో..

## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా
# గట్టిగా వాదించండి

- నీటిపారుదలశాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో వాదించాల్సిన అంశాలపై దిశానిర్దేశం
- తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని అధికారులకు ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ముఖ్యంగా అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలు, సుప్రీంకోర్టు కేసులు, సీడబ్ల్యూసీ మరియు కేఆర్ఎంబీ వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు, మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా రాష్ట్రంలో నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచడం, వివాదాలను పరిష్కరించడం, మరియు నీటి వనరుల సమర్థవంతమైన వినియోగంపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ఉంది. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన నదులపై వివాదాలు ఉన్నందున, వాటిని పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. సమావేశంలో, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ,

2లో..

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

**- రూపాయి ఖర్చు లేకుండా ఫ్రీ రిజిస్ట్రేషన్**




అమరావతి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు , రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక

2లో..

## సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి మంత్రి కొండా సురేఖ

**- పరకాల వివాదం తర్వాత ఆసక్తికర పరిణామం**

- సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన మంత్రి సురేఖ
- సీతక్కతో కలిసి రేవంత్‌కు రాఖీ కట్టిన కొండా సురేఖ
- రాజకీయాల గురించి మాట్లాడనని చెప్పిన మంత్రి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. రాఖీ సందర్భంగా మంత్రి సురేఖ, మరో మంత్రి సీతక్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. అనంతరం ఏమీ మాట్లాడకుండానే రేవంత్ నివాసం నుంచి వెళ్లిపోయారు. మంత్రి కొండా సురేఖ

2లో..

## తెలంగాణలో పెరిగిన
# క్రైమ్ రేట్

**- ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు**

- మూడేళ్లలో 7.15% పెరిగిన కేసులు
- ఆర్గనైజ్డ్ క్రైమ్‌లో 'షాకింగ్ జంప్', డ్రగ్స్ కేసుల్లో 46% వృద్ధి
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్లతో పోలిస్తే నేరాల సంఖ్య 7.15 శాతం పెరిగినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) కేసులు 46.10 శాతం పెరగడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. పోలీసు శాఖ విడుదల చేసిన

2లో..

## నేపాల్ జలప్రళయం..
## 547కి చేరిన మృతులు

- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం



**ఖాట్మండు (ప్రశ్న న్యూస్)** నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో

2లో..

## విదేశీ చదువులకు
# సర్కార్ సాయం!

**- సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలి అనేది చాలా మంది కల కంటారు. అయితే విదేశాలకు వెళ్లేంత ఆర్థిక స్థోమత లేక ఇక్కడే చదువు కొనసాగిస్తున్న వారు చాలా మంది ఉంటారు. తెలంగాణకు చెందిన బీసీ, ఈబీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సువర్ణావకాశం కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2026 ఆగస్ట్, సెప్టెంబర్ ఫాల్ సెషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విదేశాల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించాలనుకునే విద్యార్థులు

2లో..

## ప్రభుత్వానికి కాసుల పంట

- రాయదుర్గంలో మరోసారి భూముల రికార్డు ధర
- ఎకరం రూ. 269 కోట్లకు పలికిన ప్రభుత్వ భూమి
- భూమిని దక్కించుకున్న వంశీరాం బిల్డర్స్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల

2లో..

# రక్షా బంధన్ వేడుకల్లో ప్రధాని

ఉండే ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీక అని ఆయన అన్నారు. తన ఎక్స్ హ్యాండిల్‌లో ఒక పోస్ట్‌లో ప్రధాని మోదీ ఇలా అన్నారు, "రక్షాబంధన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర పండుగ మీ అందరికీ సంతోషాన్ని, శ్రేయస్సును, విజయాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకం అనే బంధం ఎప్పటికీ చెక్కుచెదరకుండా ఉండాలని ఆశిస్తున్నానన్నారు ప్రధాని మోదీ.

# రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి

రాష్ట్రంలో నీటి వనరుల వినియోగం, వాటి పరిరక్షణ, మరియు నీటి పారుదల విధానాలను సమీక్షించారు. అంతర్రాష్ట్ర నదులపై జరుగుతున్న వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టు వద్ద ఉన్న కేసులపై చర్చించారు. ఈ సందర్భంలో, సీడబ్ల్యూసీ మరియు కేఆర్ఎంబీ వంటి సంస్థల పాత్రను కూడా పరిశీలించారు. నీటి వనరుల సమర్థవంతమైన వినియోగం కోసం ప్రభుత్వానికి అవసరమైన మార్గదర్శకాలను రూపొందించడంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశం ద్వారా, నీటిపారుదల శాఖకు సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగింది. నీటి వనరుల పరిరక్షణ, వాటి సమర్థవంతమైన వినియోగం, మరియు అంతర్రాష్ట్ర నదులపై ఉన్న వివాదాలను పరిష్కరించడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం అందించబడింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో మాట్లాడుతూ, నీటి వనరుల పరిరక్షణకు సంబంధించి ప్రభుత్వానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు. పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు.

నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019–24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్

పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఏపీలోనే అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని చెప్పారు. రూపొందించుకున్న కీ–పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ఆయా రంగాల్లో వృద్ధి నమోదు చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు.

### స్థానిక వనరుల లభ్యత ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

నియోజకవర్గాల విజన్ ప్లానులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, ఆ మేరకు వీళ్లంతా వినూత్నంగా ఆలోచించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. స్థానికంగా ఉండే వనరుల లభ్యతను ఆధారంగా చేసుకుని ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ విజన్‌ను అందించిందని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు డేటా లేక్ సిద్ధం చేశామని, అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకోవడంతో పాటు పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

### పీ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు చేయూత

నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ అమలుపై ఎమ్మెల్యేలు ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. క్షేత్ర స్థాయిలో సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేవలం నగదు సాయం అందించడమే కాకుండా, వారిని ఆర్థికంగా నిలబెట్టే సాధికారత వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి–సంక్షేమం చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించే బాధ్యతను ప్రజా ప్రతినిధులే తీసుకోవాలని అన్నారు. పీ4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పారిశ్రామికవేత్తలను సైతం ప్రోత్సహిస్తూ, సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అలాగే అనుమతులు పొందుతున్న పరిశ్రమలు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో గ్రౌండ్ అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు, క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెరిగేలా ఇప్పటికే 1.50 కోట్ల ఆన్లైన్ కోర్సులు కూడా పూర్తి చేసుకున్నారని సీఎం తెలిపారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ యూనిట్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

### వినూత్నంగా ఆలోచించాలి.. మెరుగైన సేవలు అందించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు

ప్రభుత్వ నిర్ణయాల్లోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ప్రజలను భాగస్వాములను చేసినప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలల సాకారంగా చేపట్టిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగే పేరుతో కార్యక్రమం నిర్వహించగా, ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రచారం చేపట్టారని గుర్తు చేశారు. అదే విధంగా యువతకు, నిరుద్యోగులకు మేలు చేసేలా చేపట్టిన మెగా డీఎస్సీ ప్రక్రియకు అనేక అడ్డంకులు కల్పించే ప్రయత్నం జరిగినా సమర్థవంతంగా నిర్వహించి రిక్రూట్మెంట్ పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా చేపట్టిన మెగా డీఎస్సీపై విమర్శలు చేస్తుంటే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. ప్రజలను మెప్పించగలిగితే, ప్రజల నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్ డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధికి సంబంధించి లక్ష్మీగూడలో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు.

### ఆగస్టు 31న 8వేల ప్లాట్లకు లక్కీడ్రా

ఈరోజు నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

### సెప్టెంబర్ 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

### పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తోందని, చివరి విడత బిల్లుల చెల్లింపులు కూడా ప్రారంభమయ్యాయని వివరించారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయ్యే అవకాశం ఉందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వానికి డబ్బు కూడబెట్టుకోవడం కంటే పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యమని అన్నారు. ఎకరం రూ.100 కోట్లు, రూ.200 కోట్లు, రూ.300 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

### పదేళ్ల తర్వాత ఇంటిని విక్రయించే అవకాశం

ఇందిరమ్మ టవర్స్‌లో ఇల్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ అనంతరం పదేళ్ల తర్వాత అవసరాన్ని బట్టి ఇంటిని విక్రయించుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు. అంతకుముందే ఏదైనా అత్యవసర అవసరం ఏర్పడితే, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బ్యాంకులో కుదువ పెట్టుకుని రుణం పొందే అవకాశం కూడా ఉంటుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. లక్కీడ్రాలో ఇల్లు పొందిన ప్రతి లబ్ధిదారుడికి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించి అందిస్తామని మంత్రి చెప్పారు. ఒక్కో ఇంటికి 17 నుంచి 20 గజాల అన్‌డివైడెడ్ షేర్ భూమి కూడా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన స్థలాల్లో అవసరాన్ని బట్టి 10 అంతస్తుల వరకు ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని, లిఫ్ట్‌లతో పాటు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

### లక్కీడ్రా పూర్తైన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక

లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుందని, అధికారుల పరిశీలన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ తర్వాత కేవలం 3––4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షించుకునే అవకాశం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు. నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీడ్రాలో తొలుత ఎస్సీ విభాగానికి కేటాయించిన 14 శాతం రిజర్వేషన్ ప్రకారం 67 ఫ్లాట్ల కోసం 288 మంది పేర్లతో కూడిన చీటీలను డ్రమ్ములో వేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, హౌసింగ్ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ ప్రియాంక తదితర అధికారుల సమక్షంలో లబ్ధిదారులతోనే డ్రా తీయించారు. ఎస్సీ విభాగంలో తొలి ఫ్లాట్‌కు మరకాల కృష్ణవేణి ఎంపిక కాగా, అనంతరం టి.అనిత, మంగనూరి అనసూయ, ఎం.కుమారి, శైలజాకుమారి వరుసగా ఫ్లాట్లను లక్కీడ్రా ద్వారా పొందారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీలకు – 14 శాతం, ఎస్టీలకు – 5 శాతం, బీసీలకు – 16 శాతం, దివ్యాంగులకు – 5 శాతం పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు – 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు వివరించారు. ఈ ఫ్లాట్లలో మొత్తం 50 శాతం రిజర్వేషన్లు ఉండగా, మొత్తంగా మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

# నేపాల్ జలప్రళయం..

మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి. రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.

ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు. ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్

సమాచారం ప్రకారం, 2023–24లో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 2,65,377గా ఉంది, ఇది 2025–26 నాటికి 2,84,363కు చేరుకుంటుందని అంచనా వేయబడింది. ఈ సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఈ గణాంకాలు రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తి పెరుగుతున్నట్లు స్పష్టంగా సూచిస్తున్నాయి. అంతేకాక, వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) కూడా గణనీయంగా పెరిగి 25 నుంచి 451కి చేరడం గమనించదగ్గ అంశం. ఈ పరిస్థితి పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారింది, ఎందుకంటే నేరాల పెరుగుదలతో పాటు, ప్రజల భద్రతపై ప్రభావం చూపుతోంది. ఇక కొన్ని విభాగాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉదాహరణకు, సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశంగా భావించబడుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ కేసులు 26.23 శాతం తగ్గడం ప్రజలకు కొంత ఊరట కలిగిస్తోంది. అయితే, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి, కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల మరింత అధికంగా ఉంది. ఇది పోలీసు శాఖకు మరింత కష్టతరమైన పరిస్థితిని సృష్టిస్తోంది, ఎందుకంటే చిన్నపాటి నేరాలు కూడా సమాజంలో భద్రతను క్షీణతకు గురి చేస్తున్నాయి. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, కేవలం గణాంకాలపై ఆధారపడకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విధంగా, రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సంబంధించి మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి మంత్రి కొండా సురేఖ

తన కుమార్తె సుస్మిత వ్యాఖ్యలు, పరకాల వివాదం తర్వాత తొలిసారి సీఎం నివాసానికి వెళ్లడంతో చర్చనీయాంశమైంది. మంత్రి సురేఖ ముఖ్యమంత్రి నివాసం నుంచి వచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరే ఈసారి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి రాఖీ కట్టానని తెలిపారు. సీఎం కోసం ప్రత్యేకంగా చేయించిన బంగారు రాఖీ కట్టానని సీఎం అల్లుడు, మనవడికి కూడా రాఖీ కట్టినట్లు తెలిపారు. అయితే తన కుమార్తె వ్యాఖ్యలు, పరకాల అంశంపై కొండా సురేఖ స్పందించలేదు పండగ రోజు రాజకీయ పరిణామాలపై మాట్లాడను అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులు మహిళలందరికి ఉండాలన్నారు. తాను అందరికి ఆడపడుచునని తనను వేరుగా చూడొద్దన్నారు మంత్రి కొండా సురేఖ. కాగా, ప్రస్తుతం కొండా సురేఖ వ్యవహారం పైన హైకమాండ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కేసీ వేణుగోపాల్ విదేశాల నుంచి వచ్చిన తరువాత సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఢిల్లీ వెళ్లి సమావేశం కానున్నారు. ఆ సమయంలో సురేఖ పైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కొండా సురేఖ ను తప్పిస్తే ఆ స్థానంలో ఆది శ్రీనివాస్ కు అవకాశం ఇవ్వాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాల లోగానే సురేఖ ను రాజీనామా చేయమని కోరే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే.. సురేఖ మాత్రం ఈ వివాదం నుంచి బయట పడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ అవకాశం ఇస్తే వ్యక్తిగతంగా తన వాదన వినిపించేందుకు సిద్ధమయ్యారు. అయినా ఈ రోజు ఆ అవకాశం సురేఖ కు ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో వచ్చే వారం ఢిల్లీ కేంద్రంగా చోటు చేసుకునే పరిణామాలు కీలకంగా మారనున్నాయి.

# ప్రభుత్వానికి కాసుల పంట

స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.

# విదేశీ చదువులకు సర్కార్ సాయం!

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ సూచించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం ఎంపిక చేయనున్నారు. ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు.. 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్లాలనే కల ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు నిర్దేశించిన అర్హతలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఈ మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 30వ తేదీ చివరి తేదీ కావడంతో చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే అప్లికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి కలిపి రూ.5 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తు చేసే సమయానికి అభ్యర్థి వయస్సు 35 ఏళ్లకు మించకూడదని రూల్ పెట్టింది

# నైలెట్ 'రూటు' మారిందా.?

**తిరుపతి నుంచి అమరావతికి తరలింపుపై రాజకీయ దుమారం**

**రాయలసీమకు అన్యాయం చేస్తున్నారంటూ ఎంపీ గురుమూర్తి ధ్వజం**

**నైలెట్ కోసం పార్లమెంటులో ప్రశ్నిస్తా..**

**గతంలో తిరుపతిలో ఏర్పాటుకు కృషి చేశామన్న ఎంపీ**

తిరుపతి(ప్రశ్న న్యూస్) తిరుపతి నుంచి అమరావతికి నైలెట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తరలింపు అంశం రాజకీయ వేడిని రాజేస్తోంది. తిరుపతిలో ఏర్పాటు చేయాల్సిన ప్రతిష్ఠాత్మక సంస్థను అమరావతికి తరలించే ప్రయత్నం జరుగుతోందంటూ తిరుపతి ఎంపీ గురుమూర్తి చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. రాయలసీమకు కేటాయించిన విద్యా, వైద్య, సాంకేతిక సంస్థలను అమరావతికి తరలించడం ప్రాంతీయ అసమానతలకు దారితీస్తుందని ఆయన విమర్శించారు. రాజధాని నిర్మాణం పేరుతో అమరావతికి ప్రాధాన్యం ఇస్తూ రాయలసీమకు దక్కాల్సిన సంస్థలను తరలించడం సమంజసం కాదని ఎంపీ పేర్కొన్నారు. తిరుపతిలో నైలెట్ ఏర్పాటుకు గతంలో తాము చేసిన ప్రయత్నాలు, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపులను ప్రస్తావిస్తూ.. ఇప్పుడు దాని దిశ మార్చడం వెనుక కారణాలేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

### తిరుపతిలో నైలెట్ కోసం ప్రయత్నాలు




తిరుపతిలో నైలెట్ ఏర్పాటుకు గతంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి ప్రయత్నించినట్లు గురుమూర్తి తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చలు జరిపి సంస్థకు శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కేంద్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నైలెట్‌ను తిరుపతికి తీసుకురావడానికి కృషి చేసినట్లు ఎంపీ చెప్పారు. ఇటీవల కూడా కేంద్ర మంత్రులను కలిసి శాశ్వత క్యాంపస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు అదే సంస్థకు అమరావతిలో భూములు కేటాయించే ప్రయత్నం జరుగుతోందన్న వార్తలు రావడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

### 'రాయలసీమకు మరో అన్యాయం'

నైలెట్ తరలింపు నిర్ణయాన్ని రాయలసీమకు జరుగుతున్న అన్యాయంగా ఎంపీ అభివర్ణించారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా, సాంకేతిక సంస్థలు ఏర్పాటు చేస్తే అక్కడి విద్యార్థులు, యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, శిక్షణ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. అన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలను ఒకే ప్రాంతంలో కేంద్రీకరించడం వల్ల ప్రాంతీయ అభివృద్ధిలో అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# చదువు చెప్పే చేతులకు.. భరోసా ఎక్కడ.?

**- ప్రైవేటు ఉపాధ్యాయుల హక్కులకు రక్షణ ఏదీ.?**

**- కనీస వేతనం.. ఉద్యోగ భద్రత.. బీమా.. చట్టబద్ధ హక్కుల కోసం పీటీఎల్‌పీయూ డిమాండ్**



**అమరావతి(ప్రశ్న న్యూస్)** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొనకూడదని ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు కోరుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రైవేటు బోధనా సిబ్బందికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, బీమా, సంక్షేమ పథకాలు, ఓవర్‌టైం చెల్లింపులు వంటి ప్రాథమిక హక్కులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్ (పీటీఎల్‌పీయూ) డిమాండ్ చేస్తోంది.ప్రైవేటు విద్యాసంస్థలు రాష్ట్ర విద్యా వ్యవస్థలో కీలక భాగంగా మారిన నేపథ్యంలో వాటిలో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి కూడా గౌరవప్రదమైన వేతనం, స్థిరమైన ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని యూనియన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.

### విద్యాబోధనకు విలువ.. ఉపాధ్యాయుడికి విలువేదీ?

ఒక విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకం. పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆలోచనా విధానం, నైపుణ్యాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలను పెంపొందించడంలో బోధనా సిబ్బంది నిరంతరం శ్రమిస్తారు.అయితే అదే ఉపాధ్యాయుడు తన కుటుంబాన్ని పోషించడానికి సరిపడా వేతనం పొందుతున్నాడా? ఉద్యోగానికి భద్రత ఉందా? అనారోగ్యం లేదా ప్రమాదం ఎదురైతే కుటుంబానికి ఆర్థిక రక్షణ ఉందా? పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని పీటీఎల్‌పీయూ పేర్కొంటోంది.
విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే ఉపాధ్యాయుల భవిష్యత్తుకూ భరోసా ఉండాలని యూనియన్ స్పష్టం చేస్తోంది.

### కనీస వేతనం.. ప్రధాన డిమాండ్

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లకు వారి విద్యార్హతలు, అనుభవం, బోధనా బాధ్యతలకు అనుగుణంగా కనీస వేతనాన్ని నిర్ధారించాలని యూనియన్ కోరుతోంది.ఒకే రకమైన పని చేస్తున్నప్పటికీ సంస్థను బట్టి వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉండటం వల్ల బోధనా సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు చెబుతున్నారు. కనీస వేతనానికి స్పష్టమైన ప్రమాణాలు, జీతాల స్కేలు నిర్ణయిస్తే ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని పేర్కొంటున్నారు.'ఉపాధ్యాయుడి అర్హతకు తగ్గ వేతనం.. చేసిన పనికి తగ్గ గౌరవం' ఉండాలన్నది తమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని యూనియన్ చెబుతోంది.

### జీతాల స్కేలు.. స్పష్టమైన విధానం కావాలి

ప్రైవేటు రంగంలో ఉపాధ్యాయుల వేతనాల విషయంలో స్పష్టమైన స్కేలు ఉండాలని పీటీఎల్‌పీయూ కోరుతోంది. అనుభవం పెరిగిన కొద్దీ వేతనంలోనూ తగిన పెరుగుదల ఉండేలా విధానం రూపొందించాలని డిమాండ్ చేస్తోంది.అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నిలుపుకోవాలంటే వారికి గౌరవప్రదమైన వేతనంతో పాటు కెరీర్ పురోగతికి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటోంది.

### ఉద్యోగ భద్రత.. మరో కీలక అంశం

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడం అత్యవసరమని యూనియన్ చెబుతోంది. చిన్న కారణాలతో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి లేకుండా స్పష్టమైన నియమ నిబంధనలు ఉండాలని కోరుతోంది.ఉద్యోగంలో చేరినప్పటి నుంచి సేవా నిబంధనలు, పని బాధ్యతలు, వేతనం, సెలవులు, ఉద్యోగ విరమణ నిబంధనలు తదితర అంశాలను స్పష్టంగా పేర్కొంటూ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది.ఉపాధ్యాయుడికి ఉద్యోగ భద్రత ఉంటేనే అతడు విద్యార్థులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టగలడని యూనియన్ అభిప్రాయపడుతోంది.

### గుర్తింపు కార్డు.. కనీస హక్కు

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి అధికారిక గుర్తింపు కార్డులు అందించాలని పీటీఎల్‌పీయూ కోరుతోంది.తాము ఏ సంస్థలో పనిచేస్తున్నామో, ఏ హోదాలో ఉన్నామో స్పష్టంగా తెలియజేసే గుర్తింపు కార్డు ఉండటం ఉద్యోగి హక్కుగా భావించాలని పేర్కొంటోంది. దీనివల్ల ఉద్యోగి అధికారిక గుర్తింపు పొందడంతో పాటు అవసరమైన సందర్భాల్లో వివిధ సంక్షేమ పథకాలను పొందేందుకు కూడా ఉపయోగపడే అవకాశం ఉంటుందని చెబుతోంది.

### బీమా రక్షణ.. కుటుంబానికి భరోసా

అనారోగ్యం లేదా ప్రమాదం ఎవరికైనా ఎప్పుడైనా ఎదురుకావచ్చు. అలాంటి సందర్భాల్లో ప్రైవేటు బోధనా సిబ్బందికి ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని యూనియన్ డిమాండ్ చేస్తోంది.ప్రత్యేకించి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే సిబ్బందికి ప్రమాద బీమా రక్షణ ఉండాలని కోరుతోంది. ఉద్యోగి అనుకోని పరిస్థితుల్లో మరణించినా లేదా తీవ్ర అనారోగ్యానికి గురైనా కుటుంబం ఆర్థికంగా కుప్పకూలకుండా బీమా రక్షణ ఉపయోగపడుతుందని పేర్కొంటోంది.

### ఓవర్‌టైం పనిచేస్తే.. చెల్లింపులు ఎక్కడ?

పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సంస్థలు, విద్యాసంస్థల్లో సాధారణ పని సమయానికి మించి ఉపాధ్యాయులు పనిచేసే సందర్భాలు ఉంటాయి. అదనపు తరగతులు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ప్రత్యేక కార్యక్రమాలు, అడ్మిషన్ ప్రక్రియలు తదితర పనుల్లో అదనపు సమయం కేటాయించాల్సి వస్తుంటుంది.అదనపు పని చేయించినప్పుడు వర్తించే నిబంధనల ప్రకారం ఓవర్‌టైం లేదా అదనపు పని చెల్లింపుల విషయంలో స్పష్టమైన విధానం ఉండాలని పీటీఎల్‌పీయూ కోరుతోంది.

### సంక్షేమ పథకాలు.. ప్రైవేటు ఉపాధ్యాయులకూ అందాలి

ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు అనేక సంక్షేమ, సామాజిక భద్రతా సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. అదే సమయంలో ప్రైవేటు విద్యారంగంలో పనిచేస్తున్న వేలాది మంది బోధనా సిబ్బందికి కూడా అందుబాటులో ఉన్న చట్టపరమైన, సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ కోరుతోంది.ఆరోగ్య రక్షణ, ప్రమాద బీమా, సామాజిక భద్రత, మహిళా ఉద్యోగుల రక్షణ, సెలవులు, ప్రసూతి ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహనతో పాటు అమలుపై పర్యవేక్షణ అవసరమని పేర్కొంటోంది.

### అసోసియేషన్‌కు గుర్తింపు

ప్రైవేటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు తమ సమస్యలను సమష్టిగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సంఘటిత వేదిక అవసరమని పీటీఎల్‌పీయూ చెబుతోంది.ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్‌కు తగిన గుర్తింపు లభిస్తే రాష్ట్రవ్యాప్తంగా బోధనా సిబ్బంది సమస్యలను ఒకే వేదికపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొంటోంది.

### చట్టబద్ధమైన హక్కులే రక్షణ కవచం

వేతనాలు, పని గంటలు, సెలవులు, ఉద్యోగ భద్రత, ఓవర్‌టైం, బీమా వంటి అంశాల్లో ఉద్యోగులకు వర్తించే చట్టపరమైన



హక్కులపై స్పష్టత ఉండాలని యూనియన్ కోరుతోంది.నిబంధనలు కాగితాలపై ఉండటం మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖలు పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగి హక్కులు ఉల్లంఘించబడినప్పుడు ఫిర్యాదు చేసేందుకు సులభమైన వ్యవస్థ ఉండాలని పేర్కొంటోంది.

### ప్రైవేటు విద్యాసంస్థలకూ బాధ్యత ఉంది

ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడం మాత్రమే కాకుండా తమ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కూడా బాధ్యతగా తీసుకోవాలని యూనియన్ సూచిస్తోంది.అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు తగిన వేతనం చెల్లించడం సంస్థల సామాజిక బాధ్యతలో భాగమని పేర్కొంటోంది. ఉపాధ్యాయులను గౌరవిస్తేనే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడుతోంది.

### ఉపాధ్యాయుడి సంక్షేమమే.. విద్యార్థి భవిష్యత్తుకు బలం

ఉపాధ్యాయుడు ఆర్థికంగా, సామాజికంగా భద్రంగా ఉన్నప్పుడే విద్యార్థులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలడని పీటీఎల్‌పీయూ ప్రతినిధులు చెబుతున్నారు. వేతనం గురించి ఆందోళన, ఉద్యోగం ఉంటుందో లేదో అన్న భయం, అనారోగ్యం వస్తే వైద్య ఖర్చుల భారం వంటి సమస్యలు ఉంటే బోధనపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.అందువల్ల ప్రైవేటు బోధనా సిబ్బంది సంక్షేమాన్ని కేవలం ఉద్యోగుల సమస్యగా కాకుండా విద్యా వ్యవస్థ నాణ్యతకు సంబంధించిన అంశంగా చూడాలని కోరుతున్నారు.మన భవిష్యత్తు కోసం.. మనమందరం కలిసిప్రైవేటు విద్యారంగంలో పనిచేస్తున్న టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు తమ హక్కుల కోసం ఐక్యంగా ముందుకు రావాలని పీటీఎల్‌పీయూ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోంది.
కనీస వేతనం అమలు చేయాలి..జీతాల స్కేలు నిర్ణయించాలి.. ఉద్యోగ భద్రత కల్పించాలి.. గుర్తింపు కార్డులు ఇవ్వాలి.. ఆరోగ్య, ప్రమాద బీమా కల్పించాలి.. సంక్షేమ పథకాలు అందించాలి.. ఓవర్‌టైం చెల్లింపులు చేయాలి.. చట్టబద్ధమైన హక్కులను పరిరక్షించాలి.. ప్రైవేటు బోధనా సిబ్బంది సంఘానికి గుర్తింపు కల్పించాలి.. అన్న డిమాండ్లను ప్రధాన ఎజెండాగా తీసుకుని ముందుకు సాగనున్నట్లు యూనియన్ స్పష్టం చేస్తోంది. చదువు చెప్పే గురువుకు.. భవిష్యత్తుపై భరోసా కావాలి! విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించే ఉపాధ్యాయుల జీవితాల్లోనూ స్థిరత్వం రావాలి. 'ఉపాధ్యాయుల హక్కులు--మన భవిష్యత్తు' అనే నినాదంతో ప్రైవేటు విద్యారంగంలోని బోధనా సిబ్బందిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది పీటీఎల్‌పీయూ లక్ష్యంగా పేర్కొంటోంది. ప్రైవేటు విద్యారంగం విస్తరిస్తున్న కొద్దీ అందులో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వారి హక్కులు, వేతనాలు, భద్రత, సంక్షేమంపై సమగ్ర విధానం రూపొందించాల్సిన అవసరం మరింత పెరుగుతోంది. విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుడి భవిష్యత్తు అస్థిరంగా ఉండకూడదు. బోధనను వృత్తిగా ఎంచుకున్న ప్రతి ఒక్కరికీ గౌరవం, న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ లభించాలి. అప్పుడే విద్యా రంగం మరింత బలపడుతుంది.

# ఒంగోలుకు 'రాడిసన్' రాక!

**- రూ.100 కోట్లతో 5-స్టార్ హోటల్**

**- 151 విలాసవంతమైన గదులు, అంతర్జాతీయ ప్రమాణాల వసతులు**

**- యువతకు భారీగా ఉపాధి, పర్యాటక, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపు**



**సంతనూతలపాడు(ప్రశ్న న్యూస్)** ప్రకాశం జిల్లా అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. ఒంగోలు సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 5-స్టార్ హోటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సంతనూతలాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న రాడిసన్ 5-స్టార్ హోటల్‌కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శుక్రవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు.రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న తొలి 5-స్టార్ హోటల్‌గా ఇది నిలవనుండటం విశేషం. ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరానికి ఈ ప్రాజెక్టు పర్యాటక, వ్యాపార, ఆతిథ్య రంగాల్లో మరింత ప్రాధాన్యాన్ని తీసుకురానుందని భావిస్తున్నారు.

### రూ.100 కోట్ల పెట్టుబడి.. అభివృద్ధికి ఊతం

జిల్లాలో భారీ పెట్టుబడి రావడం ద్వారా స్థానిక ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. హోటల్ నిర్మాణ దశలోనే వివిధ రంగాలకు చెందిన కార్మికులు, సాంకేతిక నిపుణులు, నిర్మాణ సంస్థలకు ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. హోటల్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత ఆతిథ్య రంగంతో పాటు రవాణా, పర్యాటకం, సేవా రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి.ఒంగోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక, వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయి హోటల్ అందుబాటులోకి రావడం వ్యాపార ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పర్యాటకులకు ప్రయోజనకరంగా మారనుంది.

### 151 గదులు.. విలాసవంతమైన వసతులు

రాడిసన్ హోటల్‌లో మొత్తం 151 విలాసవంతమైన గదులు ఏర్పాటు చేయనున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలు అందించేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించారు.మల్టీ-క్యూసిన్ రెస్టారెంట్, ప్రీమియం బార్, లాంజ్‌తో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అంతర్జాతీయ స్థాయి స్విమ్మింగ్ పూల్, లగ్జరీ స్పా, అత్యాధునిక ఫిట్‌నెస్ సెంటర్ వంటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. అయితే ఇప్పటికే "ఒంగోలుకు ఇక ఫైవ్‌స్టార్ కళ" తీసుకురావడంతో పాటు ప్రకాశం జిల్లా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే ప్రాజెక్టుగా ఇది నిలుస్తోంది.

# స్థానిక 'పుర'పోరుకు జనసేన సమర సన్నాహం

**శ్రేణులను ఇప్పటి నుంచే ఎన్నికల బరిలోకి దింపాలి**

**'వంద శాతం స్ట్రైక్ రేట్' లక్ష్యంగా ముందుకు: నాదెండ్ల మనోహర్**




మంగళగిరి(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ శ్రేణులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు సాధారణ ఎన్నికలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయని, అభ్యర్థుల ఎంపిక నుంచే పార్టీ నిర్దేశించిన నియమావళిని పక్కాగా అమలు చేయాలని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినట్లు తెలిపారు.మంగళగిరిలో శుక్రవారం సాయంత్రం జరిగిన జనసేన స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి బలాబలాలు, కూటమి సమన్వయం, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సందేశాన్ని కమిటీ సభ్యులకు మనోహర్ వివరించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సాధించే విజయాల విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని మనోహర్ స్పష్టం చేశారు. 'వంద శాతం స్ట్రైక్ రేట్' సాధించాలన్నది పవన్ కల్యాణ్ సంకల్పమని, అందుకు అనుగుణంగా ప్రతి స్థాయిలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు.ప్రతి డివిజన్, ప్రతి వార్డు స్థాయిలో పార్టీ బలం ఏమిటి? ఎక్కడ బలహీనత ఉంది? ఏ సామాజిక వర్గాల్లో పార్టీకి అనుకూలత ఉంది? స్థానికంగా ప్రజల్లో మంచి పేరు ఉన్న నాయకులు ఎవరు? వంటి అంశాలను ముందుగానే గుర్తించాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా తొలుత నగరపాలక, పురపాలక సంస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మనోహర్ చెప్పారు. డివిజన్లు, వార్డుల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయాలని సూచించారు.స్థానిక ఎన్నికల్లో కేవలం పార్టీకి ఉన్న సాధారణ ఓటు బలం మాత్రమే కాకుండా.. అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో సంబంధాలు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల బలం వంటి అంశాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయని పార్టీ నాయకత్వం భావిస్తోంది.సమావేశంలో మండలి బుద్ధ ప్రసాద్, టి.శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్‌రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవికుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులకు జలకళ.. నగరానికి కొత్త కళ

**- కడప చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యం**

**- పనులు వేగవంతం చేయాలి.. సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి: కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**



కడప(ప్రశ్న న్యూస్) కడప నగర అభివృద్ధిలో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నగరంలోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడంతోపాటు సుందరీకరణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి చెరువు పరిస్థితి, ఆయకట్టు, కట్టల భద్రత, నీటి నిల్వ సామర్థ్యం, పూడికతీత, పరిరక్షణ చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.కలెక్టరేట్‌లో శుక్రవారం కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులకు కారణాలను గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### చెరువులపై ప్రత్యేక నజర్

కడప నగర పరిధిలోని చెరువుల అభివృద్ధి అంశంపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. పాకీర్‌పల్లి చెరువు అభివృద్ధి, సుందరీకరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నగర పరిధిలోని అన్ని చెరువులను ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.చెరువు కట్టల పరిస్థితి, భద్రతా చర్యలు, ఆయకట్టు వివరాలు, నీటి వనరుల పరిరక్షణ, పూడికతీత, సుందరీకరణకు ఉన్న అవకాశాలను గుర్తించాలన్నారు. కడప అసెంబ్లీ పరిధిలోని చెరువులు, కుంటల శుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దేవుని కడప, పుట్లంపల్లి చెరువుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలను చేపట్టాలని ఆదేశించారు.చెరువుల కట్టలపై అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు భవిష్యత్తులో ఆక్రమణలకు తావులేకుండా పరిరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి చెరువుకు అవసరమైన పనులను విడివిడిగా గుర్తించి వాటి అంచనా వ్యయం, పనుల ప్రాధాన్యత, అందుబాటులో ఉన్న నిధులు తదితర వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలని తెలిపారు.ఈ సమీక్షలో కడప ఆర్డీవో మురళి, నగర కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేశ్ చంద్ర, సీపీవో హజరతయ్య, కడప తహసీల్దార్ మహబూబ్ బీ, కార్పొరేషన్ ఏసీ చెన్నకేశవరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రమేష్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏసీ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఎస్ఈ చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు

# వామ్మో.. దొంగలు బాబోయ్

**- తాడేపల్లి పరిధిలో వరుస చోరీల కలకలం;- ఉండవల్లి సెంటర్‌లో రెండు దుకాణాల్లో చోరీ.. వ్యాపారుల్లో ఆందోళన**

**- నిఘా ఎక్కడ.? పోలీసుల గస్తీపై స్థానికుల ప్రశ్నలు**

**తాడేపల్లి(ప్రశ్న న్యూస్)** తాడేపల్లి పరిధిలో వరుస చోరీలు వ్యాపారులు, స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. రాత్రి వేళల్లో దొంగలు దుకాణాలను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఉండవల్లి సెంటర్‌లో తాజాగా రెండు దుకాణాల్లో చోరీ జరగడం కలకలం రేపింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న స్టీల్ దుకాణంతోపాటు సమీపంలోని ఓ బేకరీలోకి దుండగులు ప్రవేశించినట్లు సమాచారం.విశ్వసనీయ సమాచారం ప్రకారం రెండు దుకాణాల నుంచి సుమారు రూ.80 వేల విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### రద్దీ ప్రాంతంలోనే చోరీలు ఎలా.?

ఉండవల్లి సెంటర్ నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అర్ధరాత్రి సమయంలోనూ కొంతమేర వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. అలాంటి ప్రాంతంలో దుకాణాల తాళాలు పగులగొట్టి చోరీలు జరగడం స్థానికుల్లో పలు సందేహాలకు తావిస్తోంది.రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ మరింత పెంచాల్సిన అవసరం ఉందని వ్యాపారులు కోరుతున్నారు. ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాలు, బ్యాంకులు, దుకాణాల సమీపంలో నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### గతంలోనూ చోరీలు.. అయినా.?

ఇదే ప్రాంతంలో గతంలోనూ రెండు పర్యాయాలు చోరీ ఘటనలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గత ఘటనలకు సంబంధించి దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? నిందితులు పట్టుబడ్డారా.? చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? అనే ప్రశ్నలు ఇప్పుడు మరోసారి తెరపైకి వస్తున్నాయి.గతంలో జరిగిన ఘటనలతో వ్యాపారులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగి అలసిపోయామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఘటనలపై సరైన సమాచారం లేకుండానే కొత్తగా చోరీలు జరగడం ఆందోళన కలిగిస్తోందని చెబుతున్నారు.

### వ్యాపారులకు కంటిమీద కునుకులేదు

చిన్న, మధ్యతరహా దుకాణాలు నిర్వహించే వ్యాపారులు రోజంతా శ్రమించి సంపాదించిన నగదు, వస్తువులను రాత్రి దుకాణాల్లోనే ఉంచాల్సిన పరిస్థితి ఉంటుంది. తాళాలు వేసి ఇంటికి వెళ్లిన తర్వాత తమ ఆస్తులు భద్రంగా ఉంటాయన్న నమ్మకం లేకపోతే వ్యాపారం చేయడం కష్టమవుతుందని వారు అంటున్నారు.ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి గస్తీ పెంచడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడం, సీసీ కెమెరాల పనితీరును తరచూ తనిఖీ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### నిఘా వ్యవస్థపై ప్రశ్నలు

వరుస చోరీల నేపథ్యంలో స్థానికంగా పోలీసుల నిఘా వ్యవస్థపై చర్చ జరుగుతోంది. రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ ఎంత మేరకు జరుగుతోంది? కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? అనుమానాస్పద కదలికలను గుర్తించే వ్యవస్థ ఉందా? అన్న అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
అయితే చోరీలకు సంబంధించిన పూర్తి వివరాలు, నష్టం, నిందితుల గుర్తింపు వంటి అంశాలు పోలీసుల దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారించాల్సి ఉంది.




### ఇకనైనా గస్తీ పెంచాలి

తాజా ఘటన నేపథ్యంలో ఉండవల్లి సెంటర్‌తోపాటు తాడేపల్లి పరిధిలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి గస్తీని పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అదేవిధంగా వ్యాపారులు తమ దుకాణాల వద్ద నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని పోలీసులు సూచించాల్సిన అవసరం ఉంది.
"వ్యాపారులు భయపడాల్సిన పరిస్థితి రాకుండా పోలీసులు భరోసా కల్పించాలి. పాత ఘటనలతోపాటు తాజా చోరీలపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను త్వరగా గుర్తించాలి. రాత్రి వేళల్లో నిఘా, గస్తీ పెంచి మా ఆస్తులకు రక్షణ కల్పించాలి" అని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

### చోరీలకు చెక్ ఎప్పుడు.?

ఒకే ప్రాంతంలో చోరీలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం ఎంత ముఖ్యమో.. నేరం జరగకుండా ముందుగానే అడ్డుకోవడం కూడా అంతే ముఖ్యం. ఉండవల్లి సెంటర్‌లో తాజా చోరీల నేపథ్యంలో పోలీసులు గత ఘటనలను కూడా సమీక్షించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డి కి శ్రీలత శోభన్ రెడ్డి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ పవిత్రమైన రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రజలందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేస్తూ, కుటుంబాల్లో ప్రేమానురాగాలు, సోదరభావం, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## శ్రీశైల దేవస్థానం లో పౌర్ణమి రోజున గణంగ గిరిప్రదక్షిణ

### గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ప్రదక్షిణానంతరం శ్రీస్వామివార్లదర్శనం కల్పించబడుతోంది





శ్రీశైలం (ప్రశ్నన్యూస్) పౌర్ణమి సందర్భంగా దేవస్థానం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నది. సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఈ గిరిప్రదక్షిణ ప్రారంభవుతుంది. ఆలయ మహాద్వారం నుండి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుండి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంటుంది. అక్కడి నుండి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు చేరుకుంటుంది. హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్ధిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగుస్తుంది. శ్రీశైలక్షేత్రములోని ప్రాచీనమఠాలను, ఆలయాలను భక్తులచేత దర్శింపజేయిస్తూ వారిలో భక్తిభావాలను మరింతగా పెంపొందింపజేయాలని, అదేవిధంగా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదక్షిణను నిర్వహించడం జరుగుతోంది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ప్రదక్షిణానంతరం శ్రీస్వామివార్లదర్శనం కల్పించబడుతోంది.

## అన్న తమ్ముళ్ళకు రాఖీలు కట్టి శుభాభినందనలు తెలుపుకున్న అక్కా చెల్లెళ్ళు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అన్న చెల్లెళ్ళు అక్క తమ్ముళ్ళ మధ్య ఉన్న ఆప్యాయత, ప్రేమానురాగాలకు ప్రతీక అయిన రక్ష బంధన్ (రాఖీ పండుగ) సందర్భంగా మారుమూల గ్రామాలతో పాటు మహానగరం వరకు సందడిగా మారింది. శుక్రవారం వేకువజాము నుండే సోదరీమణులు తమ అన్న తమ్ముళ్ళకు రాఖీలు కట్టి పరస్పరం శుభాభినందనలు తెలుపుతున్నారు. శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకునే ఈ పండుగకు ఎంతో విశిష్టత ఉంది. తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు లేకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షిస్తు తన అన్న తమ్ములకు కట్టే రక్షా నే రాఖీ అంటారు. ఈ సందర్భంలో తమ శ్రేయస్సు, అభ్యున్నతిని ఆకాంక్షించే అక్కా చెల్లెళ్ళకు బహుమతులు ఇచ్చి వారి ఆశీస్సులు తీసుకోవడం రాఖీపౌర్ణమి అంతరార్థం. రాఖీ పండగ కుటుంబ బంధాలు,ఆప్యాయతలు, రక్షణ బాధ్యతను గుర్తు చేస్తుంది. అన్న తమ్ముళ్ళు అక్కా చెల్లెళ్లకు రక్షణగా ఉండి తమ ప్రేమానుబంధాలను పంచుకునే సదుద్దేశంతో జరుపుకునే ఈ పండుగ వారికి మాత్రమే కాక వారిని కన్న తల్లిదండ్రులకు కూడా ఎంతో ఆనందాన్ని పంచి పెడుతుందనడంలో సందేహం లేదు. సృష్టిలో తండ్రి తర్వాతి స్థానం అన్నది కాగా తల్లి తర్వాతి స్థానం అక్కా లేదా చెల్లిదే. శాశ్వతమైన ఈ బంధాన్ని ప్రతి సంవత్సరం మరింత పటిష్టం చేయడమే రాఖీ పండుగ ప్రత్యేకత.

## వేమిరెడ్డి దంపతులకు రాఖీ శుభాకాంక్షలు

### ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి రాఖీ కట్టిన మహిళా నాయకులు



నెల్లూరు(ప్రశ్న న్యూస్) రాఖీ పౌర్ణమి సందర్భంగా నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పలువురు మహిళా నాయకులు శుక్రవారం కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి మహిళా నాయకులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.అనంతరం ఎంపీని కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మహిళా నాయకులతో రాఖీ పౌర్ణమి వేడుకలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, కోవూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు షేక్ పర్వీన్, కౌన్సిలర్లు వైష్ణవి, ప్రత్యూష, లక్ష్మీకాంతమ్మ, లలితారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# శస్త్ర చికిత్సతో "69" ఏళ్ల పేషెంట్ సమస్యకు చెక్

**- తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 69 ఏళ్ల మహిళకు భారీ అండాశయ తిత్తి తొలగింపు**

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) వైద్య రంగంలో రోజు రోజుకీ అత్యధిక సంఖ్యలో వివిధ రకాల రుగ్మతలకు శస్త్ర చికిత్స ద్వారాను,నూతన పరిజ్ఞానంతో రోగులకు సేవలు అందిస్తున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన 69 ఏళ్ల రొద భాయ్ భారీ అండాశయ తిత్తి (ఓవేరియన్ సిస్ట్) కారణంగా కడుపులో తీవ్రమైన అసౌకర్యం, ఒత్తిడితో బాధపడుతూ మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లో చికిత్స కోసం చేరారు. భారీ అండాశయ తిత్తి కారణంగా పెద్ద శస్త్ర చికిత్స అవసరమయ్యే పరిస్థితి ఏర్పడగా,ఆమె ఇప్పటికే తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతుండటంతో ఈ కేసు మరింత క్లిష్టంగా మారింది. శస్త్ర చికిత్సతో పాటు మత్తుమందు ఇవ్వడం కూడా గుండె పై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో,ఈ అధిక ప్రమాదాన్ని అధిగమిస్తూ మెడికవర్ హాస్పిటల్స్,సికింద్రాబాద్‌లో బహుళ విభాగాల వైద్య నిపుణుల బృందం జాగ్రత్తగా ప్రణాళిక రూపొందించి భారీ అండాశయ తిత్తిని విజయవంతంగా తొలగించింది.

**కొన్నేళ్లుగా కడుపు నొప్పి:**

రోద భాయ్ కడుపులో భారీగా పెరిగిన అండాశయ తిత్తి కారణంగా శస్త్రచికిత్స తప్పనిసరి అయిన పరిస్థితికి చేరుకున్నారు. మరోవైపు,ఆమెకు ఉన్న తీవ్రమైన గుండె జబ్బు వైద్యులకు ప్రధాన సవాలుగా మారింది. పెద్ద స్థాయి కడుపు శస్త్రచికిత్స గుండెపై అదనపు ఒత్తిడిని కలిగించవచ్చు. మత్తు మందు సమయంలో రక్తపోటు,గుండె స్పందన, రక్త ప్రసరణలో మార్పులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రమాదం మరింత పెరిగింది. అందువల్ల తిత్తిని పూర్తిగా తొలగించడంతో పాటు, శస్త్ర చికిత్స మొత్తం సమయంలో రోగి గుండె పరిస్థితిని స్థిరంగా ఉంచడం వైద్యుల ముందున్న ప్రధాన సవాలుగా నిలిచింది.

**సమస్యతో సవాల్:**

ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను డాక్టర్ మాధవి డొక్కు, గైనకాలజిస్ట్ నేతృత్వంలో నిర్వహించారు. డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి, కార్డియాలజిస్ట్ గుండె సంబంధిత అంశాలను పర్యవేక్షించగా,డాక్టర్ శ్రీనివాస్, అనస్థీషియాలజిస్ట్ మత్తుమందు నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. శస్త్రచికిత్సకు ముందు, శస్త్రచికిత్స సమయంలో, అనంతరం రోగి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ముగ్గురు నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు.

**గత కొన్నేళ్లుగా గుండెకి చిల్లు:**

తీవ్రమైన గుండె జబ్బు ఉన్నందున ఈ శస్త్రచికిత్స రోగి కుటుంబానికి కూడా ఆందోళన కలిగించే పరిస్థితిగా మారింది. శస్త్రచికిత్సకు సిద్ధం చేయడం నుంచి మత్తుమందు ఇవ్వడం, భారీ తిత్తిని తొలగించడం, శస్త్రచికిత్స అనంతరం గుండె పరిస్థితిని పర్యవేక్షించడం వరకు ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్త అవసరమైంది. గైనకాలజీ, కార్డియాలజీ,అనస్థీషియా విభాగాల సమన్వయంతో వైద్య బృందం గుండెకు సంబంధించిన ప్రమాదాలను నియంత్రిస్తూ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది.

**ఒకపక్క గుండె సమస్య, మరోపక్క అండాశయంలో తిత్తితో పరిషాన్:**

తీవ్రమైన గుండె జబ్బుతో ఉన్న రోగికి పెద్ద శస్త్రచికిత్స చేయడం ఎంత క్లిష్టమైనదో ఈ కేసు స్పష్టం చేస్తోంది. ఒకేసారి గైనకాలజీ, కార్డియాలజీ,అనస్థీషియా నిపుణులు సమన్వయంతో పనిచేయడం ద్వారా ఇలాంటి అధిక ప్రమాదం ఉన్న శస్త్రచికిత్సలను సురక్షితంగా నిర్వహించవచ్చని ఈ విజయవంతమైన చికిత్స తెలియజేస్తోంది. డాక్టర్ మాధవి డొక్కు మాట్లాడుతూ,"భారీ అండాశయ తిత్తిని తొలగించడం సాధారణ పరిస్థితుల్లోనే సవాలుతో కూడుకున్న శస్త్రచికిత్స. ఈ రోగికి తీవ్రమైన గుండె జబ్బు ఉండటంతో ప్రమాదం మరింత పెరిగింది. శస్త్రచికిత్స సమయంలో గుండె స్థితి స్థిరంగా ఉండేలా చూసుకుంటూనే తిత్తిని సురక్షితంగా తొలగించడం మా ప్రధాన లక్ష్యం. గైనకాలజీ, కార్డియాలజీ, అనస్థీషియా విభాగాల మధ్య సమన్వయం ఈ విజయానికి ఎంతో కీలకమైంది" అని తెలిపారు. ఇలాంటి క్లిష్టమైన, అధిక ప్రమాదం ఉన్న కేసుల్లో ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు వివిధ విభాగాల నిపుణుల సమన్వయం ఎంత కీలకమో ఈ చికిత్స తెలియజేస్తోంది. సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు సమగ్ర వైద్యం అందించడంలో మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ వైద్య బృందం చూపిన నైపుణ్యానికి ఈ విజయవంతమైన చికిత్స నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ కృష్ణవేణి,మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కంటోన్మెంట్ లో ఇందిరమ్మ ఇళ్లు,"4"మాత్రమే హాజరు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని బోయిన్ పల్లి మల్లారెడ్డి గార్డెన్ లో ఇందిరమ్మ ఇండ్ల లాటరీ నిర్వహించారు. 1626 దరఖాస్తులకు గాను 140 ఇళ్లను లాటరీ ద్వారా గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. సికింద్రాబాద్ ఆర్డీవోతో పాటు గృహనిర్మాణ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. లాటరీలో ఇల్లులు వచ్చిన లబ్ధిదారులు తెలంగాణ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కలగానే మిగిలిపోతుందన్న తమకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా అదృష్టం వరించిందని అన్నారు. లాల్ బజార్ శాస్త్రి నగర్ కు చెందిన ఓ వృద్ధ మహిళకు ఇల్లు రావడంతో ఆమె కూతురు కన్నీటిపర్యంతమయ్యారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన లాటరీ పద్ధతి ద్వారా తమకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ నగరంలో ఇల్లు కట్టుకునే పరిస్థితి లేని పేద ప్రజల కోసం ప్రభుత్వం ఆలోచించి ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకువచ్చి లబ్ధిదారులను ఎంపిక చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్డీవో సాయి రాం, హౌసింగ్ సొసైటీ ఉన్నతాధికారి రవీందర్ రెడ్డి, తిరుమల గిరి ఎమ్మార్వో బిక్షపతి, ఆర్ ఐ సునీల్, చంద్రశేఖర్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**రక్షాబంధన్ స్పెషల్:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో "ఇందిరమ్మ ఇళ్ల"పథకం నిన్న బోయిన్ పల్లి లో ఉన్న మల్లారెడ్డి గార్డెన్ లో ఏర్పాటు చేసిన మండలాధికారులు. కానీ ఇక్కడే అసలు విషయం చోటు చేసుకుంది. అదేంటంటే అన్న చెల్లెలఅందమైన బంధానికి గుర్తుగా "రక్షాబంధన్"కారణంగా "ఇందిరమ్మ ఇళ్ల"కార్యక్రమానికి ఎవరు హాజరు కాలేదు. వేదికంత బోసిపోయింది. కానీ ఓ స్పెషల్ ఏమిటంటే "140" మందిని ఎంపిక చేసిన వారిలో కేవలం నాలుగు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన "136"మంది ఇంటికే పరిమితం అయ్యారు.



**అధికారులు,నాయకులు నిర్లక్ష్యం:**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఏ నిర్మాణం చేయాలన్నా "రక్షణ మంత్రిత్వ శాఖ"అనుమతులు తప్పనిసరి. భవన నిర్మాణం ఎత్తు విషయంలో బేగం పేట ప్రాంతంలో విమానాశ్రయం ఉండడం ఓ కారణం. కానీ కొన్నింటికి మినహాయింపు ఉంది .ఉదహరణకు: సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు సుమారు ఏడు అంతస్తుల నిర్మాణం, తిరుమల గిరి ప్రాంతంలో జెఎన్ యుఆర్ఎంఎం పథకం ద్వారా ఐదు అంతస్థుల భవనాలు నిర్మించారు. కానీ ప్రస్తుతం "ఇందిరమ్మ ఇళ్ల"విషయంలో ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం "480" ఇళు కేటాయించారు. కానీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో మాత్రం "140"కేటాయించడం శోచనీయమని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కానీ హౌసింగ్ అధికారులు తీరును తప్పుబట్టారు స్థానికులు. రాష్ట్రంలో 118 నియోజకవర్గాలకు" 480"ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ కి మాత్రం"140" కేటాయించడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు.

## శ్రీశైలం దేవస్థానం సంబంద సిద్ధవటంలో

# నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**- శ్రీశైలమహాక్షేత్రానికి దక్షిణద్వారంగా ప్రసిద్ధికెక్కిన కడపజిల్లాలోని జ్యోతిస్సిద్ధవట ఆలయాలలోని నిత్యకైంకర్యాలను దేవస్థానమే నిర్వహించడం జరుగుతోందన్నారు.**

**-దేవస్థాన దత్తత దేవాలయమైన సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజప్రతిష్ఠా మహోత్సవం**

**- ఈ నెల 29 నుంచి 31 వరకు మూడు రోజులపాటు జరగనున్న కార్యక్రమాలు**

**-ఈ నెల 31వ తేదీ ఉదయం గం. 10.51 నిలకు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ**

శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైల దేవస్థాన దత్తత దేవాలయమైన సిద్ధవటక్షేత్రంలోని శ్రీకామాక్షీసమేత సిద్ధవటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజులపాటు అనగా ఈ నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ నెల 31వ తేదీన గం. 10.51 ని.లకు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం ఉంటుందన్నారుకాగా శ్రీశైలమహాక్షేత్రానికి దక్షిణద్వారంగా ప్రసిద్ధికెక్కిన కడపజిల్లాలోని జ్యోతిస్సిద్ధవట ఆలయాలలోని నిత్యకైంకర్యాలను దేవస్థానమే నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ జ్యోతిస్సిద్ధవటక్షేత్రాలు పురాణపరంగా మరియు చారిత్రకంగా ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగివున్నాయన్నారు. ఈ జ్యోతిస్సిద్ధవట ఆలయాలను దశలవారిగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం మూడు రోజులపాటు అనగా ఆగష్టు 29 నుంచి 31 వరకు నిర్వహించడం జరుగుతోందన్నారు. కాగా 29వ తేదీ ఉదయం గం. 8.00లకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆ రోజు ఉదయం గణపతిపూజ తరువాత ఋత్విగ్వరణం, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మండపారాధనలు ఉంటాయన్నారు. అదేరోజు సాయంత్రం గం. 4.30ల నుంచి అగ్నిప్రతిష్ఠాపన, అంకురారోపణ, ధ్వజాంగహోమాలు, నీరాజన మంత్రపుష్పాలు జరిపించబడుతాయన్నారు. అదేవిధంగా రెండవరోజైన 30వ తేది ఉదయం గం. 8.00ల నుంచి వేదపారాయణలు, నవగ్రహజపాలు, శివపంచాక్షరీజపం, ధ్వజమంత్ర పునశ్చరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ రోజు సాయంత్రం గం. 4.30ల నుంచి ప్రతిష్ఠా సంబంధిహోమాలు, వేదపారాయణలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. చివరిరోజైన 31వ తేదీన ఉదయం గం. 8.00ల నుంచి పారాయణలు, జపాలు నిర్వహించబడుతాయన్నారు. ఆ తరువాత గం. 10.51 ని.లకు నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించబడుతుందన్నారు. అనంతరం పూర్ణాహుతి, అవభృధం కార్యక్రమాలు జరిపించబడుతాయన్నారు. మహదాశీర్వచన కార్యక్రమముతో ఈ ధ్వజప్రతిష్ఠామహోత్సవం ముగించబడుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో మొత్తం 10 మంది ఋత్వికులు పాల్గొంటున్నారన్నారు. అదేవిధంగా కార్యక్రమ నిర్వహణకై పలువురు దేవస్థానం అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడం కూడా జరిగిందన్నారు. యావన్మంది భక్తాదులు, స్థానికులు ఈ నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాలకు విచ్చేసి శ్రీ కామాక్షీ సమేత సిద్ధవటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలను పొందవలసినదిగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.





# రాఖీ పండుగ సందర్భంగా బాలసదనం పిల్లలకు ఆత్మీయ ఆతిథ్యం

**- కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ప్రభుత్వ బాలసదనం బాలబాలికలు జిల్లా కలెక్టర్ మనుచౌదరికి రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాలసదనం పిల్లల కోసం ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి, వారికి స్వీట్లు కొత్త దుస్తులను అందజేశారు. పిల్లలతో కలిసి భోజనం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి అవసరాలను తెలుసుకున్నారు.పిల్లల చదువు, ఆరోగ్యం మరియు సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పిల్లల విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, బాలక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి , జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం తదితర అధికారులు పాల్గొన్నారు.రక్షాబంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు బాలసదనం పిల్లలు రాఖీలు కట్టడం, పిల్లలతో కలిసి భోజనం చేసి వారికి స్వీట్లు, కొత్త దుస్తులు అందించడం ద్వారా అధికారులు పిల్లలకు ఆప్యాయత, భరోసాను కల్పించారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కో కన్వీనర్ల నియామకం

**- జవహర్‌నగర్, చంద్రపురి కాలనీ డివిజన్లకు నూతన కమిటీలు**



**కీసర( ప్రశ్న న్యూస్)** రాబోయే గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని జవహర్‌నగర్, చంద్రపురి కాలనీ డివిజన్ల పరిధిలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కో కన్వీనర్లను నియమించారు. శుక్రవారం సాయంత్రం మహంకాళి ఆలయ ప్రాంగణంలో జిల్లా సీనియర్ నాయకులు రజినీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డివిజన్ కన్వీనర్లు దొంతమల్ల రాంబాబు, అరుణ్ యాదవ్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. జవహర్‌నగర్ డివిజన్ కో కన్వీనర్లుగా శ్రీను, గౌతమ్, నవీన్ కుమార్ యాదవ్లను, చంద్రపురి కాలనీ డివిజన్ కో కన్వీనర్లుగా శివ కేశవ్, మహేష్ గౌడ్, బాలు గౌడ్, మహేందర్లను జిల్లా సీనియర్ నాయకులు రజినీకాంత్ నియమించారు. అదేవిధంగా రెండు డివిజన్లకు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కార్తీక్ రెడ్డి, బసవేశ్వర్, హేమంత్, కిరణ్, విష్ణు, శ్రీకాంత్, రమేష్, ఆశిష్, అనుపమ్, సత్యం, సాయిలను నియమించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ.. రాబోయే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమితి సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండు డివిజన్లను కలుపుకుని ప్రభుత్వ అధికారులు, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సభ్యులందరూ నిర్ణయించారని తెలిపారు. త్వరలో సమావేశ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# పీటీడీ కమిషనర్‌గా శివప్రసాద్.. ఆర్టీసీ ఇన్‌ఛార్జి ఎండీగా అదనపు బాధ్యతలు

**- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ.. తదుపరి ఆదేశాల వరకు కొనసాగింపు**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా శాఖ (పీటీడీ) కమిషనర్‌గా, ఏపీఎస్‌ఆర్టీసీ ఎక్స్‌అఫీషియో వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం. శివప్రసాద్‌కు ప్రభుత్వం ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన ఏపీఎస్‌ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.ఈ మేరకు రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు శివప్రసాద్ ఈ అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## రవాణా శాఖలో కీలక బాధ్యత

ప్రజారవాణా వ్యవస్థ నిర్వహణతోపాటు ఏపీఎస్‌ఆర్టీసీ పరిపాలనలో పీటీడీ కమిషనర్, ఎక్స్‌అఫీషియో వైస్‌చైర్మన్, ఎండీ బాధ్యతలు కీలకమైనవి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, ప్రజారవాణా వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం, సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేయడం వంటి అంశాల్లో ఈ బాధ్యతలకు ప్రాధాన్యం ఉంటుంది.ప్రస్తుతం ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శివప్రసాద్‌కు అదనంగా ఈ బాధ్యతలు అప్పగించడంతో సంస్థ పరిపాలనలో సమన్వయం మరింత కీలకం కానుంది.

## కార్మిక పరిషత్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ

శివప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి కోసూరి సురేంద్ర తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శివప్రసాద్‌కు వారు అభినందనలు తెలిపారు. ప్రజారవాణా సంస్థలో కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన అంశాలతోపాటు సంస్థ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు వంటి అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు తెలిపారు.
ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు శివప్రసాద్ పీటీడీ కమిషనర్, ఏపీఎస్‌ఆర్టీసీ ఎక్స్‌అఫీషియో వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలను అదనంగా నిర్వహించనున్నారు.

# గొల్లపూడిలో 'అంతస్తుల' దందా.?

**- అనుమతి జీ౦3.. నిర్మాణం జీ౦4.. జీ౦5కు సన్నాహాలంటూ ఆరోపణలు - పంట కాలవ రోడ్డుపై భారీ భవనం.. నిబంధనలు గాలికేనా.?**

**- సీఆర్‌డీఏ తనిఖీలు ఎక్కడ.? అనుమతి పత్రాలు బయటపెట్టాలి - అక్రమమైతే చర్యలు.. సక్రమమైతే రికార్డులతో స్పష్టత ఇవ్వాలి**

**విజయవాడ/గొల్లపూడి(ప్రశ్న న్యూస్)** రాజధాని ప్రాంత అభివృద్ధి పరుగులు పెడుతున్న కొద్దీ నిర్మాణ రంగం కూడా శరవేగంగా విస్తరిస్తోంది. కొత్త రహదారులు.. పెరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు.. భారీ భవనాలు.. ఆకాశహర్మ్యాలను తలపించే నిర్మాణాలు.. వెరసి విజయవాడ పరిసర ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయి. అయితే అభివృద్ధి వేగంతోపాటు నిర్మాణ నిబంధనలు కూడా అదే స్థాయిలో అమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.గొల్లపూడి పంట కాలవ రోడ్డుపై ఓ భారీ నిర్మాణానికి సంబంధించి స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలు ఈ ప్రశ్నలకు మరింత పదును పెడుతున్నాయి. జీ౦3 వరకు అనుమతి ఉందని ప్రచారం జరుగుతుండగా.. నిర్మాణం జీ౦4ను దాటి జీ౦5 దిశగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? అసలు మంజూరైన అనుమతి ఏమిటి? ప్రస్తుతం భవనం ఎన్ని అంతస్తుల వరకు నిర్మితమైంది? అదనపు అంతస్తులకు సవరించిన అనుమతులు ఉన్నాయా? అన్నది సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.ఇది కేవలం ఒక భవనం విషయంలో తలెత్తిన సందేహంగా చూడలేం. నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలు, అధికారుల పర్యవేక్షణ, ప్రభుత్వ ఆదాయం, ప్రజా భద్రత వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్న వ్యవహారంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## అనుమతి ఎంత? నిర్మాణం ఎంత?

నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలో భవన విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్, పార్కింగ్, రహదారి వెడల్పు, వినియోగం తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తారు. ఆమోదించిన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణం జరగాలి. అయితే గొల్లపూడి పంట కాలవ రోడ్డుపై నిర్మాణానికి సంబంధించి అనుమతించిన అంతస్తులకు మించి నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీ౦4 స్లాబ్ దశకు చేరిందని, జీ౦5కు కూడా పనులు ప్రారంభమైనట్లు స్థానికులు చెబుతున్నారు. అలా అయితే ప్రశ్న ఒక్కటే---
అదనపు అంతస్తులకు అనుమతి ఉందా?ఉంటే.. ఆ అనుమతి ఎప్పుడు ఇచ్చారు? ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు? ఆమోదించిన సవరించిన ప్లాన్ ఏమిటి? నిర్మాణదారుడు సంబంధిత ఫీజులు చెల్లించారా? అన్నది ప్రజలకు తెలియాలి. అనుమతి లేకపోతే.. మరి నిర్మాణం అక్కడి వరకు ఎలా వచ్చింది? అధికారుల తనిఖీలు ఎప్పుడు జరిగాయి? ఏమైనా నోటీసులు ఇచ్చారా? తదుపరి చర్యలు ఏమిటి? అన్నదీ తేలాలి.

## 'కనిపించని' నిర్మాణం.. అధికారులకు కనిపించదా?

ఒక అంతస్తు నిర్మించడానికి కూడా రోజులు, వారాలు పడతాయి. భారీ భవనం నిర్మాణం అయితే నెలల తరబడి కొనసాగుతుంది. నిర్మాణ సామగ్రి రాకపోకలు, కార్మికుల పని, స్లాబ్‌ల నిర్మాణం.. ఇవన్నీ బహిరంగంగానే జరుగుతాయి.అయితే ప్రజలకు కనిపించే నిర్మాణం సంబంధిత అధికారుల పర్యవేక్షణ వ్యవస్థకు కనిపించకపోవడం ఎలా? అన్నది స్థానికుల ప్రశ్న. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తే అనుమతికి మించి నిర్మాణం ప్రారంభమైన దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది. ఒకవేళ తనిఖీలు జరిగి, నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే ఉందని అధికారులు నిర్ధారించి ఉంటే.. ఆ వివరాలను వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుంది.
మౌనం కంటే రికార్డులే సమాధానం కావాలి.

## అనుమతి పత్రాలు బయటపెట్టండి

ఈ వ్యవహారంపై ప్రజల్లో అనుమానాలు తొలగాలంటే సీఆర్‌డీఏ అధికారులు పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.
సంబంధిత భవనానికి సంబంధించిన మంజూరైన బిల్డింగ్ పర్మిషన్ ఆమోదించిన భవన ప్రణాళిక అనుమతించిన అంతస్తుల సంఖ్య
మొత్తం నిర్మాణ విస్తీర్ణం సెట్‌బ్యాక్ వివరాలు పార్కింగ్ నిబంధనలు భవన వినియోగానికి సంబంధించిన అనుమతులు సవరించిన ప్లాన్ ఉంటే దాని వివరాలు అదనపు అంతస్తులకు అనుమతులు ఉంటే వాటి వివరాలు చెల్లించిన ఫీజులు, ఇతర చార్జీలు
అధికారులు నిర్వహించిన తనిఖీల వివరాలు జారీ చేసిన నోటీసులు, తదుపరి చర్యలు వంటి వివరాలను అధికారికంగా వెల్లడిస్తే అసలు విషయం బయటపడుతుంది.

## చిన్న నిర్మాణానికి ఒక నిబంధన.. భారీ భవనానికి మరో నిబంధనా?

ఇది ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్న మరో కీలక ప్రశ్న.సాధారణ ప్రజలు ఇల్లు నిర్మించుకునే సమయంలో ఒక్కో అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సెట్‌బ్యాక్ నుంచి భవన ఎత్తు వరకు ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలిస్తారు. నిబంధనల్లో స్వల్ప ఉల్లంఘన జరిగినా నోటీసులు జారీ చేసే సందర్భాలు ఉంటాయి.మరి అదే సమయంలో భారీ వాణిజ్య నిర్మాణాల విషయంలోనూ అదే స్థాయి పర్యవేక్షణ కొనసాగుతోందా?చట్టం చిన్నవాడికోసం మాత్రమేనా? పెద్ద నిర్మాణదారులకు కూడా అదే వర్తిస్తుందా?అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన సమయం వచ్చింది.

## ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందా?

అనుమతించిన నిర్మాణ పరిమితిని మించి నిర్మాణం జరిగితే సంబంధిత నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, చార్జీలు, ఇతర ఆదాయాలపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.అనధికార నిర్మాణాలు భవిష్యత్తులో క్రమబద్ధీకరణ, పన్నులు, పార్కింగ్, రహదారి వినియోగం వంటి అనేక అంశాల్లో సమస్యలకు దారితీయవచ్చు.అంతేకాదు.. అధిక అంతస్తులు అంటే అదనపు వాహనాలు, అదనపు జనాభా, అదనపు నీటి అవసరం, డ్రైనేజీపై అదనపు భారం. అగ్నిప్రమాదం వంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా ప్రమాణాలు కూడా కీలకమవుతాయి.అందుకే "అనుమతి ఉందా లేదా?" అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం అవసరం.

## 'ముడుపుల' ఆరోపణలు ఉంటే విచారణ తప్పదు

అనుమతులకు మించి నిర్మాణం జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో కొందరు స్థానికులు అధికారులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం ఉంది. అయితే ఎవరైనా ముడుపులు తీసుకున్నారనే విషయాన్ని ఆధారాలు లేకుండా నిజమని చెప్పడం సమంజసం కాదు.అయితే ఇలాంటి ఆరోపణలు వెలువడినప్పుడు వాటిని పూర్తిగా విస్మరించడం కూడా సరికాదు.ఎవరైనా అధికారిపై ఆరోపణలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులు రికార్డులు పరిశీలించాలి. అనుమతుల ప్రక్రియలో ఎవరు ఫైల్ పరిశీలించారు? ఎప్పుడు తనిఖీ జరిగింది? ఏ నివేదిక ఆధారంగా అనుమతి ఇచ్చారు? సవరించిన అనుమతులు ఉంటే ఎవరు మంజూరు చేశారు? వంటి అంశాలను పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయి.తప్పు తేలితే చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు తప్పని తేలితే అధికారిక రికార్డులతో ప్రజలకు చెప్పాలి.

## పంట కాలవ రోడ్డుపై పెరుగుతున్న నిర్మాణ ఒత్తిడి

గొల్లపూడి ప్రాంతం నగర విస్తరణలో కీలకంగా మారుతోంది. విజయవాడకు సమీపంలో ఉండటం, రవాణా సౌకర్యాలు,



వాణిజ్య కార్యకలాపాల పెరుగుదల కారణంగా నిర్మాణ రంగం వేగం పుంజుకుంది.ఇలాంటి సమయంలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు రహదారి సామర్థ్యం, పార్కింగ్, డ్రైనేజీ, నీటి సరఫరా, అగ్నిమాపక భద్రత వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి.ఒక భవనం నిబంధనలకు విరుద్ధంగా నిర్మించబడితే దాని ప్రభావం ఆ భవనం యజమానిపైనే కాకుండా చుట్టుపక్కల ప్రజలపైనా పడుతుంది.

## అధికారుల తనిఖీకి ఇదే సరైన సమయం

ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించాల్సిన అవసరం ఉంది.మంజూరైన ప్లాన్ ఒకవైపు.. వాస్తవ నిర్మాణం మరోవైపు ఉంచి పరిశీలించాలి. అంతస్తుల సంఖ్య, నిర్మాణ విస్తీర్ణం, సెట్‌బ్యాక్, పార్కింగ్, భద్రతా ప్రమాణాలు, అనుమతుల వివరాలను సరిపోల్చాలి.ఉల్లంఘన ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ఉల్లంఘన లేదని తేలితే ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించాలి.ఇలా చేస్తే ప్రజల్లో నెలకొన్న సందేహాలకు శాశ్వతంగా తెరపడుతుంది.

## నిశ్శబ్దం కాదు.. స్పష్టత కావాలి

గొల్లపూడి పంట కాలవ రోడ్డుపై జరుగుతున్న నిర్మాణంపై వస్తున్న ఆరోపణలు నిజమా? కాదా? అన్నది చివరకు అధికారిక తనిఖీతోనే తేలాలి. ప్రజలు తీర్పు చెప్పాల్సిన అవసరం లేదు. మీడియా కూడా ఆరోపణలను తీర్పులుగా మార్చకూడదు.కానీ ప్రజల తరఫున ప్రశ్నించడం మాత్రం తప్పనిసరి.అనుమతి ఉంటే చూపించండి.అనుమతి మేరకే నిర్మాణమైతే స్పష్టం చేయండి.అదనపు అనుమతి ఉంటే పత్రాలు వెల్లడించండి.ఉల్లంఘన ఉంటే చర్యలు తీసుకోండి.అధికారులపై ఆరోపణలుంటే విచారణ జరిపించండి.

# అక్రమ ఇసుకకు 'చెక్'

## కరజాడలో రెండు లారీలు సీజ్

**- రెవెన్యూ, పోలీసు, గనుల శాఖల సంయుక్త దాడులు**

**శ్రీకాకుళం(ప్రశ్న న్యూస్)** కరజాడలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై అధికారులు కొరడా ఝుళిపించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు, గనుల శాఖల అధికారులు శుక్రవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇసుక లోడుతో వెళ్తున్న రెండు లారీలను గుర్తించి సీజ్ చేశారు. వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

## ముందస్తు సమాచారంతో దాడులు


మండల పరిధిలోని కరజాడ గ్రామంలో ఇసుక తవ్వకాలు, రవాణాకు సంబంధించి సమాచారం అందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శ్రీకాకుళం తహసీల్దార్ శిర్ల గణపతి, ఎస్సై కేవీ సురేష్, మైనింగ్ ఏపీడీ మాణిక్యాలరావు తమ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అనుమతులు, రవాణా పత్రాలు తదితర అంశాలను పరిశీలించారు.
ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన రెండు లారీలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోంది.

## ప్రకృతి వనరులపై నిఘా

ఇసుక వంటి సహజ వనరులను అనుమతులు లేకుండా తవ్వడం, తరలించడం వల్ల పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఇసుక రవాణా జరిగితే ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెంచుతున్నట్లు తెలిపారు.

## అనుమతులు లేకుంటే చర్యలే

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు.



నిబంధనలను ఉల్లంఘించి ఇసుక తరలింపునకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన సందర్భాల్లో భారీ జరిమానాలు, కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోవడంలో వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకంగా మారుతోంది. రెవెన్యూ, గనుల శాఖలతో పాటు పోలీసు యంత్రాంగం కూడా తనిఖీల్లో భాగస్వామ్యం కావడంతో అక్రమ రవాణాపై నియంత్రణకు అవకాశం ఏర్పడుతోంది. కరజాడలో జరిగిన సంయుక్త తనిఖీలు ఈ దిశలో భాగంగానే అధికారులు పేర్కొంటున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల సీజ్

ఇసుక తరలించే వాహనాలకు సంబంధించి అవసరమైన అనుమతులు, పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కరజాడలో రెండు లారీలు సీజ్ కావడంతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారికి అధికారులు గట్టి హెచ్చరిక ఇచ్చినట్లయింది. సహజ వనరుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ నిబంధనలను అమలు చేయడంలో ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# ఏపీ గ్రీన్ సారథిగా: నాగబాబు

## కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ

**2047 నాటికి 50 శాతం వృక్ష, అటవీ విస్తీర్ణమే లక్ష్యం**




మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రీచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా జనసేన పార్టీ శాసన మండలి సభ్యుడు కొణిదెల నాగబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో తన సతీమణి పద్మజతో కలిసి ఆయన పాల్గొన్నారు. వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు.

### పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు అటవీ విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే ఏపీ గ్రీన్. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్య సాధనలో ఏపీ గ్రీన్ సొసైటీ కీలక పాత్ర పోషించనుంది. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, పచ్చదనం పెంపు, పునర్వనీకరణ వంటి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత సొసైటీపై ఉంది.

### కేబినెట్ హోదా

ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా నాగబాబుకు ప్రభుత్వం కేబినెట్ ర్యాంకు హోదా కల్పించింది. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విస్తరణ వంటి కీలక లక్ష్యాలతో పనిచేసే సంస్థకు ఆయన నాయకత్వం వహించనున్నారు.

### అభినందనల వెల్లువ

బాధ్యతలు స్వీకరించిన నాగబాబును అటవీశాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అడిషనల్ పీసీసీఎఫ్ చీఫ్ రాహుల్ పాండే, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, సీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎన్.నాగేశ్వరరావు, సీసీఎఫ్ గుంటూరు వై.శ్రీనివాసరెడ్డి, పీసీసీఎఫ్ విజిలెన్స్ రేవతి, ఏపీ గ్రీన్ సీఈఓ బి.ఎన్.ఎన్.మూర్తి తదితరులు నాగబాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ వెంకటకృష్ణ, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, తూర్పుకాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల సందీప్ తదితరులు నాగబాబును కలిసి అభినందించారు.

### ముందున్న కీలక బాధ్యత

రాష్ట్రంలో పచ్చదనం పెంచడం, అటవీ ప్రాంతాలను విస్తరించడం, పునర్వనీకరణను ప్రోత్సహించడం వంటి అంశాల్లో ఏపీ గ్రీన్ కార్యక్రమం కీలకంగా మారనుంది. 2047 లక్ష్యాన్ని చేరుకోవాలంటే దీర్ఘకాలిక ప్రణాళికతో పాటు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ కీలక పాత్ర పోషించనుంది. ఈ నేపథ్యంలో నాగబాబు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# దసరా రద్దీకి.. ఇంద్రకీలాద్రి సిద్ధం

**ముందస్తు ఏర్పాట్లపై ఈవో శీనా నాయక్ సమీక్ష**

**క్యూ లైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యంపై ప్రత్యేక దృష్టి**

**సెప్టెంబరు 3న ట్రస్టుబోర్డు కీలక సమావేశం**




విజయవాడ(ప్రశ్న న్యూస్). ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు--2026కు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి దేశ, విదేశాల నుంచి భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. మహామండపం నాలుగో అంతస్తులోని నూతన సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ఈవో అధ్యక్షతన దసరా మహోత్సవాల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. దేవస్థానంలోని వివిధ విభాగాల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, వైదిక కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమగ్రంగా చర్చించారు.

### భక్తుల రద్దీకి తగ్గట్లుగా..

దసరా నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఈవో పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా క్యూ లైన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య ఏర్పాట్లు, ప్రసాద వితరణ, వైద్య సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తకుండా క్యూలైన్ల నిర్వహణను పక్కాగా ప్రణాళిక చేయాలని, రద్దీ నియంత్రణలో వివిధ విభాగాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

# కేరళలో ఓనం పండుగ

- **మావెలి మళ్లీ వస్తున్నాడు.. ఓనం తెస్తున్న ఆనందం!**
- **పూల పూకలంతో స్వాగతం.. అరటి ఆకుపై అపురూప సద్యా**
- **మహాబలి చక్రవర్తి జ్ఞాపకంగా పది రోజుల సంబరం**
- **పంటల పండుగే కాదు.. సమానత్వం, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఓనం**
- **ప్రపంచవ్యాప్తంగా మలయాళీల ఇళ్లలో వెల్లివిరిసే సంస్కృతి, సంప్రదాయాల వైభవం**

ఇంటి ముంగిట రంగురంగుల పూలతో అందమైన పూకలం.. సంప్రదాయ దుస్తుల్లో కుటుంబ సభ్యులు.. బంధుమిత్రుల కలయిక..
అరటి ఆకుపై వరుసగా కొలువుదీరే రుచికరమైన వంటకాలు..

**(ఆంధ్రప్రదేశ్ ప్రశ్న న్యూస్ బ్యూరో తోట వెంకట్)**

**పిల్లల కేరింతలు..**
**కళాకారుల నృత్యాలు..**
**పడవల పోటీల సందడి..**
**ఎక్కడ చూసినా పండుగ వాతావరణం.**

ఇదే కేరళలో ఓనం సందడి. మలయాళీలకు అత్యంత ప్రీతిపాత్రమైన ఈ పండుగ కేవలం పంటల పండుగ గానే కాకుండా.. ఒక సంస్కృతికి, ఒక జీవన విధానానికి, సమానత్వ భావనకు ప్రతీకగా నిలుస్తోంది. కేరళలోనే కాదు.. దేశ విదేశాల్లో నివసిస్తున్న మలయాళీలు సైతం ఓనంను తమ మూలాలతో ముడిపడిన పండుగగా భావించి ఘనంగా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరడం.. ఇళ్లను శుభ్రం చేసి అలంకరించడం.. కొత్త దుస్తులు ధరించడం.. బంధువులకు బహుమతులు ఇవ్వడం.. సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేయడం.. పూలతో ముంగిట అలంకరించడం వంటి కార్యక్రమాలతో పది రోజుల పాటు పండుగ సందడి కొనసాగుతుంది.

### మహాబలి కోసం ఎదురుచూపులు..

ఓనం వెనుక అత్యంత ప్రాచుర్యం పొందిన పురాణగాథ మహాబలి చక్రవర్తికి సంబంధించినది. ప్రహ్లాదుని మనవడైన మహాబలి అసుర వంశానికి చెందిన రాజు. అయితే ఆయనను కేవలం అసుర రాజుగా కాకుండా.. ప్రజలను ప్రేమించిన ధర్మపరుడైన, దానశీలుడైన, ఉదారమైన పాలకుడిగా పురాణాలు వర్ణిస్తాయిమహాబలి పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేవారని విశ్వాసం. ధనిక, పేద అనే తేడా లేకుండా.. ఉన్నత, నిమ్న భేదాలు లేకుండా.. అందరూ సమానంగా జీవించేవారని చెబుతారు. ఆకలి, దారిద్ర్యం, అన్యాయం వంటి వాటికి చోటు లేకుండా ప్రజలు ఆనందంగా ఉండేవారని మలయాళీ సంప్రదాయ కథనాలు చెబుతాయిఅలాంటి మహాబలి చక్రవర్తి కీర్తి మూడు లోకాలకు వ్యాపించింది. ఆయన పెరుగుతున్న ప్రభావంతో దేవతలు ఆందోళన చెందారని పురాణగాథ చెబుతుంది. దీంతో విష్ణుమూర్తిని ఆశ్రయించారు.

### వామనుడి రూపంలో విష్ణువు

దేవతల ప్రార్థన మేరకు శ్రీమహావిష్ణువు వామనుడి రూపంలో మహాబలి వద్దకు వెళ్లాడు. యజ్ఞం నిర్వహిస్తున్న మహాబలి వద్దకు వెళ్లిన వామనుడు తనకు మూడు అడుగుల మేర భూమి కావాలని కోరాడు.
దానశీలుడైన మహాబలి అందుకు అంగీకరించాడు. అయితే వామనుడు క్షణాల్లో విశ్వరూపాన్ని ధరించాడు. ఒక అడుగుతో భూమిని.. మరో అడుగుతో ఆకాశాన్ని కొలిచాడు. మూడో అడుగు ఎక్కడ వేయాలన్న ప్రశ్న ఎదురైంది. తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి మహాబలి తన తలను మూడో అడుగుకు సమర్పించాడు. తన భక్తి, దానగుణం, మాట నిలబెట్టుకున్న తీరుకు విష్ణువు ప్రసన్నుడయ్యాడని పురాణగాథ చెబుతుంది. మహాబలికి ఒక వరం లభించింది. సంవత్సరానికి ఒకసారి తన ప్రజలను చూసేందుకు భూమిపైకి వచ్చేందుకు అనుమతి కోరాడని.. విష్ణువు ఆ కోరికను అనుగ్రహించాడని విశ్వాసం. తన రాజు మళ్లీ తమను చూడటానికి వస్తాడన్న ఆనందంతో ప్రజలు జరుపుకునే పండుగే ఓనం అని మలయాళీ సంప్రదాయం చెబుతుంది.
అందుకే ఓనం సమయంలో ప్రతి ఇంటిలోనూ ఒకే భావన కనిపిస్తుంది. 'మావెలి తంపురాన్ వస్తున్నాడు.. మనలను చూసేందుకు వస్తున్నాడు' అనే ఆనందం వెల్లివిరుస్తుంది.

### చింగం మాసంలో సందడి

మలయాళ క్యాలెండర్‌లో చింగం మాసంలో ఓనం వస్తుంది. సాధారణంగా ఆగస్టు--సెప్టెంబరు మధ్య ఈ పండుగ జరుగుతుంది. పది రోజుల పాటు జరిగే వేడుకల్లో చివరి రోజు తిరువోణం అత్యంత ప్రధానమైనది. 2026లో తిరువోణం ఆగస్టు 26న జరుపుకుంటారు. అంతకు ముందు ఉత్రాదం ఆగస్టు 25న వస్తుంది. ఆ తరువాతి రోజులు కూడా పండుగ వాతావరణంలోనే కొనసాగుతాయి.
ఓనం అంటే ఒక్కరోజు పండుగ కాదు. పది రోజుల పాటు ఇంటింటా, ఊరూరా సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలు కలగలసిన ఉత్సవం.

### తొలి అడుగు.. అథం

ఓనం వేడుకలు అథం రోజుతో ప్రారంభమవుతాయి. ఈ రోజున ఇళ్ల ముందు పూకలం వేయడం ప్రారంభిస్తారు. చిన్న పూల అలంకరణతో మొదలైన పూకలం.. రోజులు గడిచే కొద్దీ మరింత పెద్దదిగా, అందంగా మారుతుంది.
ప్రతి రోజూ కొత్త పూలను జోడిస్తూ ప్రత్యేక ఆకృతులు రూపొందిస్తారు. ఇంటి ముంగిట పూలతో అలంకరించడం కేవలం అందం కోసం కాదు. మహాబలి చక్రవర్తిని ఇంటికి ఆహ్వానించేందుకు చేస్తున్న స్వాగత ఏర్పాటుగా దీనిని భావిస్తారు.

### పది రోజుల పూల పండుగ

అథం తర్వాత చిత్తిర, చోది, విశాఖం, అనిజం, త్రికేత, మూలం, పూరాదం, ఉత్రాదం దశలుగా వేడుకలు సాగుతాయి. ప్రతి రోజుకూ ప్రత్యేకత ఉంటుంది.
చోది రోజున కొత్త దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోళ్లు ఊపందుకుంటాయి. ఉత్రాదం నాటికి ఇళ్లలో పండుగ ఏర్పాట్లు దాదాపు పూర్తవుతాయి. కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరుతారు.








### ఇక తిరువోణం రోజు పండుగకు పరాకాష్ఠ.

### అరటి ఆకుపై విందు.. 'ఓనం సద్య'

ఓనం అనగానే ముందుగా గుర్తొచ్చేది 'ఓనం సద్య'. అరటి ఆకుపై సంప్రదాయ పద్ధతిలో వడ్డించే ఈ విందు కేరళ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు. సద్యలో ప్రాంతానుసారం వంటకాల సంఖ్య, రకాలు మారినా.. సాంబార్, అవియల్, ఓలన్, తోరన్, పచ్చడి, పప్పు, వివిధ రకాల కూరలు, ఊరగాయలు, పాయసం వంటి అనేక వంటకాలు చోటు చేసుకుంటాయి. ఒకే వరుసలో కుటుంబ సభ్యులంతా కూర్చుని భోజనం చేయడం సద్యలోని ప్రత్యేకత. ఎవరు ధనవంతుడు.. ఎవరు పేదవాడు అనే తేడా లేకుండా అందరూ ఒకే విందును పంచుకోవడం ఓనం అందించే సమానత్వ సందేశాన్ని ప్రతిబింబిస్తుంది. సద్య కేవలం భోజనం కాదు. కుటుంబాన్ని ఒకచోట చేర్చే సంప్రదాయం. బంధాలను బలపరిచే ఆచారం. ఆతిథ్యానికి ప్రతీక.

### పడవలపై పండుగ జోరు

కేరళలో ఓనం వేడుకలకు మరో ప్రత్యేక ఆకర్షణ వల్లంకళి. పొడవైన సంప్రదాయ పడవలపై జరిగే పడవ పందేలు ప్రజలను ఉర్రూతలూగిస్తాయి.
ఒకే పడవలో అనేకమంది పడవ నడిపేవారు సమన్వయంతో ముందుకు సాగుతారు. ఒకరి అడుగు తప్పినా మొత్తం బృందంపై ప్రభావం పడుతుంది. అందుకే వల్లంకళి కేవలం పోటీ కాదు.. ఐక్యత, సమన్వయం, బృందస్ఫూర్తికి ప్రతీక.
నదీ తీరాలు వేలాది మంది ప్రేక్షకులతో కిక్కిరిసిపోతాయి. పడవలపై సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ పోటీదారులు ఉత్సాహంగా ముందుకు సాగుతుంటే.. తీరాల్లో ప్రేక్షకుల కేరింతలు మార్మోగుతాయి.

### పులుల నృత్యం.. కళల సందడి

ఓనం వేడుకల్లో పులికళి ప్రత్యేక ఆకర్షణ. కళాకారులు శరీరంపై పులి ఆకృతులు వేసుకుని, పులి వేషధారణతో నృత్యాలు చేస్తారు. డప్పుల మోతకు అనుగుణంగా జరిగే ఈ నృత్యం చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటుంది.
అలాగే కైకొట్టికళి, తిరువాతిర వంటి సంప్రదాయ నృత్యాలు మహిళల భాగస్వామ్యంతో వైభవంగా జరుగుతాయి. పాటలు, నృత్యాలు, జానపద కళలు.. ఇలా కేరళ సంస్కృతిలోని ప్రతి కోణాన్నీ ఓనం తనలో ఇముడ్చుకుంది.

### కొత్త బట్టలు.. కొత్త ఆశలు

ఓనం సందర్భంగా కొత్త దుస్తులు ధరించడం కూడా ఒక ముఖ్యమైన సంప్రదాయం. 'ఓనక్కోడి' పేరుతో కొత్త దుస్తులు కొనుగోలు చేసి కుటుంబ సభ్యులు పరస్పరం బహుమతులుగా అందించుకుంటారు.
ఇంటిని శుభ్రం చేయడం, అలంకరించడం, బంధువులను ఆహ్వానించడం, పొరుగువారితో సంతోషాన్ని పంచుకోవడం.. ఇలా పండుగ ప్రతి కుటుంబాన్ని ఉత్సాహంతో నింపుతుంది.

### సమానత్వానికి ప్రతీక

ఓనం ప్రత్యేకతలో ముఖ్యమైనది సమానత్వ భావన. మహాబలి పాలనలో ప్రజలంతా సమానంగా జీవించారన్న విశ్వాసం ఈ పండుగకు సామాజిక సందేశాన్ని అందించింది.
కులం, మతం, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా ప్రజలు కలిసి పండుగను జరుపుకోవడం ఓనం గొప్పతనం. అందుకే కేరళలోని ప్రతి వర్గం ఈ పండుగను తమదిగా భావిస్తుంది.
ఓనం పూల పూకలంలో ఉన్నన్ని రంగులు.. సమాజంలో ఉన్న వైవిధ్యానికి ప్రతీకలైతే.. సద్యలో ఒకే వరుసలో కూర్చునే ఆచారం అందరూ సమానమే అన్న సందేశాన్ని ఇస్తుంది.

### ప్రపంచమంతా మలయాళీ సందడి

కేరళ సరిహద్దులు దాటి ప్రపంచంలోని అనేక దేశాల్లో మలయాళీ సంఘాలు ఓనం వేడుకలను నిర్వహిస్తున్నాయి. విదేశాల్లో ఉన్నా.. స్వదేశానికి దూరంగా ఉన్నా.. తమ సంస్కృతి, సంప్రదాయాలను తరువాతి తరాలకు పరిచయం చేయడానికి ఓనం ఒక వేదికగా నిలుస్తోంది. పూకలం పోటీలు, ఓనం సద్య, సంప్రదాయ దుస్తులు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మలయాళీలు తమ మూలాలను గుర్తుచేసుకుంటున్నారు.

### పండుగ చెప్పే సందేశం ఇదే..

కాలం మారినా.. జీవన విధానాలు మారినా.. సాంకేతికత ఎంత పెరిగినా.. మనిషి కోరుకునేది సంతోషమే. కుటుంబంతో కలిసి గడిపే సమయం.. బంధువులతో పంచుకునే ఆప్యాయత.. పొరుగువారితో కలిసిమెలిసి ఉండే అనుబంధం.. ప్రకృతికి కృతజ్ఞత చెప్పే భావన.. ఇవన్నీ ఓనం మనకు గుర్తుచేస్తుంది. పంట పండించిన రైతుకు కృతజ్ఞత చెప్పడం నుంచి.. ఇంటి ముంగిట పూకలం వేయడం వరకు.. అరటి ఆకుపై సద్య వడ్డించడం నుంచి.. పడవ పందేల్లో బృందస్ఫూర్తిని చాటడం వరకు.. ప్రతి ఆచారం వెనుక ఒక సామాజిక, సాంస్కృతిక సందేశం దాగి ఉంది. ఓనం అంటే కేవలం పండుగ కాదు.. ఒక జ్ఞాపకం. ఒక సంప్రదాయం. ఒక సంస్కృతి. ఒక కుటుంబ అనుబంధం. అన్నింటికంటే ముఖ్యంగా సమానత్వం, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని పంచుకునే జీవన సందేశం. మహాబలి చక్రవర్తి ఏడాదికి ఒక్కసారి తన ప్రజలను చూసేందుకు వస్తాడన్న విశ్వాసంతో మలయాళీలు ఇళ్లను పూలతో అలంకరిస్తారు. ఆయనకు స్వాగతం పలుకుతారు. సంతోషాన్ని పంచుకుంటారు. అందుకే ప్రతి ఓనం ఒక కొత్త ఆశకు ఆరంభం. ప్రతి పూకలం ఒక స్వాగత సందేశం. ప్రతి సద్య ఒక అనుబంధం. ప్రతి పడవ పందెం ఒక ఐక్యతకు నిదర్శనం.
మావెలి రావాలి.. ప్రతి ఇంటా ఆనందం నిండాలి.
పంటలు పండాలి.. కుటుంబాలు కళకళలాడాలి.
భేదాలు తొలగాలి.. మానవత్వం వెల్లివిరియాలి.
అదే ఓనం అసలైన సందేశం!

**మలయాళీ సోదర, సోదరీమణులకు ఓనం శుభాకాంక్షలు!**

# మంథనిలో ఘనంగా

## నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం

- కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన అవధానుల పురుషోత్తం, కిషోర్ శర్మ.



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని పట్టణంలోని అన్ని వాడల్లోని దేవాలయాల్లో శుక్రవారం నూతన యజ్ఞోపవిత్రధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తమ్మి చెరువుకట్ట వీధిలో గల శ్రీ హనుమాన్ దేవాలయం లో వేద పండితులు అవధానుల పురుషోత్తం శర్మ, కిషోర్ శర్మ లు హోమగుండం ఏర్పాటుచేసి వేదమంత్రాలతో బ్రాహ్మణులచే నూతన యజ్ఞోపవీతము వేయించారు. ఉపవీతాలు యజ్ఞోపవీతాలు దారం పోగులచే మూడు వరసలుగా చేసి బ్రహ్మముడితో చేయబడినది (జంధ్య ము) యజ్ఞోపవీతం. హిందువులు దారపు పోగులనే ధర్మం కోసం అన్ని కార్యక్రమాల్లోనూ ఉపయోగిస్తారు. స్త్రీలు వ్రత తోరణాలు, మంగళసూత్రం మొదలగు వాటికి దారపు పోగులను ఉపయోగించడం ఉదాత్త భాగంగా పరిగణిస్తారు. అలాగే ఈ రోజున సోదరీ సోదరీమణులు సోదరులకు రక్షాబంధన్ కట్టి ఆశీర్వాదం పొందుతారు.

# శంషాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

## ఘనంగా గాయత్రీ ధారణ వేడుకలు



**శంషాబాద్ (ప్రశ్న న్యూస్)** పవిత్రమైన రక్షాబంధన, గాయత్రీ ధారణ కార్యక్రమాన్ని శంషాబాద్ లోని పద్మశాలి సంఘం లో ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పద్మశాలి మార్కండేయ సేవా సమితి అధ్యక్షుడు పులిపాటి పాండు ఆధ్వర్యంలో శుక్రవారం రక్షాబంధనం . గాయత్రి మాల ధారణ, యజ్ఞోపవీతం, ( జంధ్యం ) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారి పణి ఆధ్వర్యంలో గణపతి పూజ. మార్కండేయ వ్రతాన్ని నిర్వహించారు . అనంతరం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులందరూ ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకొని నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం దేశానికి రక్షణ అంటూ ప్రమాణం చేశారు. అనంతరం యజ్ఞోపవీతాలను మార్చుకున్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పులిపాటి పాండు, సంఘం నాయకులు వర్కల శ్రీరాములు,, బొడ్డు మనోహర్, కాశి గారి ఆంజనేయులు, వర్కల బాలరాజ్, పులిపాటి రవి, పులిపాటి ప్రవీణ్, పాపని వెంకటేష్, బొడ్డు విశాల్ కుమార్, కాడిగే కృష్ణ, నారని రాజు, రవి, మేకల సుధాకర్, వెంకటేష్, నాగేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు

# ఖేలో ఇండియా డైలాగ్

## ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మై భారత్ ఆధ్వర్యంలో మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" కార్యక్రమాన్ని నిర్వహించారు జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా మై భారత్, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను గుర్తించడం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలను ప్రధానమంత్రి సందేశం ప్రధానంగా ఉద్ఘాటించింది. కూకట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని యువతను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు.మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి , ప్రతిభ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మిస్ ఇ. నాగలక్ష్మి పాల్గొన్నారు. కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ మై భారత్ తరఫున కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకరమైన జీవనశైలితో యువతను శక్తివంతం చేసి వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో భాగస్వాములను చేయాలనే ప్రధానమంత్రి దృష్టికోణాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.మై భారత్, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ యువత క్రీడలు ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని మై భారత్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వికసిత భారత్ నిర్మాణానికి తమ ఆలోచనలు, శక్తితో అర్థవంతమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి సిపిఎం డిమాండ్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి –ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించి విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ గోడ ప్రతిని అతికించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మండలం కార్యదర్శి ఎం .నరేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో అధిక ఫీజులు, వివిధ పేర్లతో అదనపు వసూళ్లు, పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా తదితర ఖర్చులతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని అన్నారు. విద్యను లాభాపేక్షతో నడిపే విధానాన్ని అరికట్టాలని,ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు సమగ్ర ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫీజులనిర్ణయం, వసూళ్లు, ఇతరచార్జీలపై పారదర్శకమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతినిధులకు కూడా నియంత్రణ కమిటీల్లో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.విద్య అనేది వస్తువు కాదు – ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు, పేద, ధనిక, గ్రామీణ పట్టణ, కుల, మత భేదాలు లేకుండా ప్రతి బిడ్డకు సమానమైన, నాణ్యమైన విద్య అందాలి. రాజ్యాంగం ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే విద్యా వ్యవస్థ అవసరమని, అందరికీ ఉచిత, నాణ్యమైన విద్య అందించడం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, తగినంత మంది ఉపాధ్యాయులను నియమించడం, విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని గణనీయంగా పెంచడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ నుంచి కాపాడి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. కామన్ స్కూల్ వ్యవస్థ కావాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ . కృష్ణ, శ్రీను, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు రోజులుగా తాగునీరు వృథా

- కోట మైసమ్మ ఆలయం ముందు మిషన్ భగీరథ పైప్ పగిలినా పట్టించుకోని అధికారులు
- కళ్లముందే వృథాగా పోతున్న విలువైన నీరు.. స్పందన కరువు!



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ పట్టణంలోని కోట మైసమ్మ దేవాలయం ముందు మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి గత నాలుగు రోజులుగా తాగునీరు భారీగా వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విలువైన తాగునీరు కళ్లముందే వృథాగా పోతున్నప్పటికీ పైప్‌లైన్ మరమ్మతులకు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నీరు వృథా.. ప్రజలకు ఇబ్బందులు

పైప్ పగిలిన ప్రాంతం నుంచి నీరు రోడ్డుపైకి ప్రవహిస్తూ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతరం నీరు ప్రవహిస్తుండటంతో రోడ్డు దెబ్బతినే అవకాశం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పైప్‌లైన్ పగిలి నాలుగు రోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీస్తున్నారు.

### వెంటనే మరమ్మతులు చేపట్టాలి

ఇప్పటికైనా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు

- సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపడతామని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు.సీపీఎం గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేసిందన్నారు. విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి, విద్యుత్ చార్జీలు పెంచేందుకు చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని తెలిపారు.అందులో భాగంగా నిర్వహించిన 'చలో హైదరాబాద్' కార్యక్రమంపై పోలీసులు కాల్పులు జరపడంతో రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి మృతి చెందారని గుర్తుచేశారు. పోలీసుల చర్యల్లో వందలాది మంది గాయపడ్డారని తెలిపారు. విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల ప్రభావంతో అనంతరం ఏర్పడిన ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ప్రకటించిందని, అప్పటి నుంచి ఉచిత విద్యుత్ కొనసాగుతోందని పేర్కొన్నారు.ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని ఎల్లయ్య ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని, క్రాస్ సబ్సిడీలను ఎత్తివేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తోందన్నారు. ఈ విధానాల వల్ల భవిష్యత్తులో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఫోన్ రీఛార్జ్ చేసుకున్న విధంగానే కరెంటును కూడా ముందస్తుగా రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. నూతన విద్యుత్ సవరణ చట్టం, విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, బండ్ల స్వామి పాల్గొన్నారు.

# ప్రత్యేక నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ప్రారంభం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పట్టణంలోనే మొదటి సారిగా ప్రఖ్యాత చిన్న పిల్లల హాస్పిటల్ అయిన లోటస్ హాస్పిటల్స్ సాంకేతిక సహకారంతో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ను అందుబాటులోనికి మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ తీసుకొచ్చింది.శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ పీడియాట్రిషియన్ లోటస్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డా. వి యస్ వి ప్రసాద్ పాల్గొన్నారు.మేడ్చల్ పట్టణంలో ఉన్న మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ కు చెందిన మెడినోవా సూపర్ స్పెషాలటి హాస్పిటల్స్ వారు అపుడే పుట్టిన శిశువులకు సంబంధించిన ప్రత్యేక నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ను నేడు ప్రారంభించారు. మేడ్చల్ పట్టణంలోనే మొదటి సారిగా ప్రముఖ చిన్న పిల్లల వైద్య సంస్థ అయిన లోటస్ హాస్పిటల్స్ వారి సాంకేతిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఎన్ ఐ సి యు లో అపుడే పుట్టిన శిశువుకు సంబంధించి ఇన్ఫెక్షన్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఆక్సిజన్ అందకపోవడం, పాలు తాగలేకపోవడం, నెలలు నిండక ముందే జన్మించిన శిశువులు, తక్కువ బరువుతో పుట్టిన శిశువలకు సంబంధించిన అత్యవసర చికిత్సలు అందించడానికి వీలవుతుంది. అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ లెవల్ 3 స్థాయి ఎన్ఐసీయూ ఆరు పడకలు కలిగి శ్వాసకోస వెంటిలేటర్ సదుపాయం, ఇంక్యుబేటర్ ఉష్ణ సంరక్షణ వంటి పలు చికిత్సలు అందించవచ్చు. ఇంతటి ఆధునిక ఎన్ ఐ సి యు యూనిట్ ను నేటి ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ పీడియాట్రిషియన్ లోటస్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డా. వి యస్ వి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. వి యస్ వి ప్రసాద్ మాట్లాడుతూ అపుడే పుట్టిన శిశువలకు అవసరమైన అత్యవసర చికిత్స అందించే అత్యాధునిక సదుపాయాన్ని మెడినోవా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్స్ వారు మేడ్చల్ ప్రాంతంలో మొట్ట మొదటి సారిగా ప్రజలకు అందుబాటులోనికి తీసుకొనిరావడం సంతోషకరమైన అంశమన్నారు. అత్యవసర పరిస్థితిలో వెనువెంటనే చికిత్సను స్థానికంగా అందిస్తే అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చుని ఇది గుర్తించి మెడినోవా హాస్పిటల్స్ ఎన్నో ప్రత్యేక సదుపాయాలను మేడ్చల్ ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. నేటి నుంచి ఈ ఎన్ఐసీయూ సదుపాయం రోగులకు అందుబాటులోనికి వస్తుందని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. అవసరమైన వారు ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ పీడియాట్రిషియన్ మరియు లోటస్ హాస్పిటల్స్ వ్యవస్థాపకుల డాక్టర్ వి ఎస్ వి ప్రసాద్ తో పాటూ ప్రొఫెసర్ కె మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, ఐనిష్ డా. వి యస్ వి ప్రసాద్, ప్రముఖ పీడియాట్రిషియన్, జజూ, మెడిసిటి గ్రూప్ ఆఫ్ సీఈఓ ఐనిష్ మర్చంట్,డైరక్టర్ డాక్టర్ సి గీత మెడికల్ అడ్మినిస్ట్రేషన్, మెడిసిటి హాస్పిటల్స్ తో పాటూ మెడిసిటి హాస్పిటల్స్ మెడినోవా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్స్ కు చెందిన వైద్యులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఆత్మీయ అనుబంధం

- మాజీ మంత్రి హరీశ్‌రావుకు రాఖీ కట్టిన మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్)** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్ ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.హరీశ్‌రావుతో తనకున్న సోదర సమానమైన ఆత్మీయ అనుబంధాన్ని చాటుతూ మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్ రాఖీ కట్టారు. అనంతరం హరీశ్‌రావు ఆమెను ఆప్యాయంగా ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కుటుంబంలో నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న అనుబంధం కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, కుటుంబ సభ్యుల్లా ఆత్మీయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరాభిమానాన్ని చాటుకున్న ఈ కలయిక ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన అంక్షరెడ్డి

- రాఖీ పౌర్ణమి సందర్భంగా సీఎం నివాసంలో మర్యాదపూర్వక భేటి




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** హైదరాబాద్, రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు తూంకుంట అంక్షరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డికి అంక్షరెడ్డి రాఖీ కట్టారు. అనంతరం మిఠాయి తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంక్షరెడ్డికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# బైక్ మోత.. రోడ్డుపై బీభత్సం

**- సైలెన్సర్ సౌండ్‌తో హడలిపోతున్న జనం.. వేగానికి హద్దులేవా.? - మైనర్ల చేతిలో మోటారు బైకులు.. వింత సైలెన్సర్ సౌండ్ల తో రెచ్చిపోతున్న పోకిరీల**
**- రేసింగ్ మోజుతో ప్రాణాలతో చెలగాటం - వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటేనే భయం.. నిబంధనలు ఎక్కడ.?**

**(ప్రజా ప్రశ్న ప్రత్యేక కథనం --స్టేట్ బ్యూరో వెంకట్ తోట)**





పట్టణాలు, నగరాల్లో ద్విచక్రవాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్త మోడళ్ల బైకులు యువతను ఆకర్షిస్తున్నాయి. సాంకేతికంగా మెరుగైన వాహనాలు రాక రాకపోగా.. వాటిని కొందరు రోడ్లపై ప్రదర్శించే తీరు మాత్రం ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ముఖ్యంగా బైక్‌లకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చడం, భారీ శబ్దాలతో రోడ్లపై దూసుకెళ్లడం, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, జిగ్‌జాగ్ రైడింగ్ వంటి చర్యలు ఇతర వాహనదారుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి.బైక్ శబ్దం వినిపిస్తే చాలు.. ఎక్కడి నుంచి దూసుకొస్తుందోనని వెనక్కి తిరిగి చూడాల్సిన పరిస్థితి. రోడ్డుపై నడిచే పాదచారులు ఒక్కసారిగా అప్రమత్తం కావాల్సిందే. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం పొంచి ఉంటోంది. రోడ్లు అందరివీ అయినా.. కొందరి వేగం, శబ్దం కారణంగా సామాన్య ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడితే నిబంధనల అమలు ఎక్కడన్న ప్రశ్న తలెత్తుతోంది.

## సైలెన్సర్ మార్చి.. శబ్ద కాలుష్యానికి తెర

కొత్త మోడల్ బైక్ కొనుగోలు చేయడం తప్పు కాదు. యువతకు ద్విచక్రవాహనాలపై ఆసక్తి ఉండటమూ సహజమే. కానీ వాహన తయారీ సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చి భారీ శబ్దాలు వచ్చేలా చేయడం మాత్రం ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే అంశం.రాత్రివేళల్లో ఈ శబ్దాల తీవ్రత మరింత ఇబ్బందికరంగా మారుతుంది. నివాస ప్రాంతాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, దేవాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద భారీ శబ్దాలతో బైక్‌లు నడపడం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, రోగులు ఇబ్బంది పడే అవకాశం ఉంది.బైక్ యజమాని వినోదం కోసం చేసే మార్పు.. ప్రజలకు శబ్ద కాలుష్యంగా మారకూడదన్నదే ప్రధాన ప్రశ్న.

## వేగానికి హద్దేది.?

రోడ్డు ఖాళీగా కనిపిస్తే కొందరు యువ రైడర్లు వేగం పెంచడం సాధారణంగా మారుతోంది. కానీ రోడ్డుపై ఒక్కసారిగా పాదచారి రావచ్చు. ఎదురుగా వాహనం రావచ్చు. చిన్న తప్పిదం జరిగినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది.ఓవర్‌టేకింగ్, హఠాత్తుగా లేన్ మార్చడం, సిగ్నళ్లను పట్టించుకోకపోవడం, వాహనాల మధ్య నుంచి దూసుకెళ్లడం వంటి ర్యాష్ డ్రైవింగ్ పద్ధతులు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారే అవకాశం ఉంది.రోడ్డు రేసింగ్ ట్రాక్ కాదు.. వేగం ప్రదర్శించే వేదిక అంతకన్నా కాదు.

## మైనర్ల చేతిలో బైక్.. తల్లిదండ్రుల బాధ్యత ఏది.?

ఇంకో తీవ్రమైన సమస్య మైనర్ల డ్రైవింగ్. డ్రైవింగ్‌కు చట్టబద్ధమైన వయసు రాకముందే పిల్లల చేతికి బైక్‌లు ఇవ్వడం ప్రమాదకరమే కాకుండా చట్టపరమైన సమస్యలకు కూడా దారితీయవచ్చు.పిల్లవాడు బైక్ అడిగాడని ఇచ్చేయడం తల్లిదండ్రుల ప్రేమ కావచ్చు. కానీ రోడ్డు మీద ఎదురయ్యే ప్రమాదాలను ఎదుర్కొనేంత పరిణతి అతనికి ఉందా.? ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉందా.? అత్యవసర పరిస్థితిలో బ్రేక్ వేయగలడా.? అనే ప్రశ్నలను తల్లిదండ్రులు ముందుగా ఆలోచించాలి.పిల్ల చేతికి బైక్ ఇచ్చే ముందు.. అతని చేతిలో బాధ్యత ఉందా అని తల్లిదండ్రులు చూడాలి.

## వృద్ధులు బయటకు రావాలంటే భయం

నడకే ఆధారంగా జీవించే వృద్ధులకు రోడ్డు దాటడం ఇప్పుడు సవాలుగా మారుతోంది. వేగంగా దూసుకొచ్చే బైక్‌లు, అకస్మాత్తుగా వినిపించే భారీ సైలెన్సర్ శబ్దాలు వారిని భయపెట్టే అవకాశం ఉంది.చెవులు సరిగా వినిపించని వృద్ధులు, నెమ్మదిగా నడిచే వారు, దృష్టి సమస్యలున్న వారు మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఒక బైక్ రైడర్ నిర్లక్ష్యం కారణంగా ఒక కుటుంబం మొత్తం విషాదంలోకి వెళ్లే పరిస్థితి రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

## మహిళలు.. పిల్లలకూ రోడ్డు భయం

పాఠశాలలు, మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో మహిళలు, చిన్నారులు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి చోట్ల అతివేగంతో బైక్‌లు నడపడం ప్రమాదకరం.పాదచారులకు కూడా రహదారిపై హక్కు ఉంది. వాహనదారుల హక్కుతో పాటు వారి భద్రతను గౌరవించాల్సిన బాధ్యత కూడా ఉంది. ఒక్క నిమిషం ఆలస్యం అయినా ఫర్వాలేదు.. ఒక్క ప్రాణం పోయాక తిరిగి రాదు.

## సౌండ్ పెంచితే.. ప్రమాదం కూడా పెరుగుతుందా.?

కొత్త బైక్‌ల సౌండ్, మోడల్, స్టైల్ యువతను ఆకర్షించవచ్చు. కానీ వాహనం రోడ్డుపై నడుస్తున్నప్పుడు అది ప్రజా రహదారిలో భాగస్వామి అవుతుంది. వ్యక్తిగత అభిరుచికి, ప్రజా భద్రతకు మధ్య గీత ఉండాలి.అక్రమంగా మార్చిన సైలెన్సర్లు, అనధికార మార్పులు, అధిక శబ్దం చేసే పరికరాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇలాంటి వాహనాలపై పర్యవేక్షణ పెంచితే ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది.

## రేసింగ్ మోజు.. ప్రాణాలతో చెలగాటం

సినిమాల్లోనో, సామాజిక మాధ్యమాల్లోనో కనిపించే బైక్ స్టంట్లు, రేసింగ్ దృశ్యాలను నిజ జీవితంలో అనుకరించడం అత్యంత ప్రమాదకరం. రహదారిపై వీలీ చేయడం, వేగంగా మలుపులు తిప్పడం, రెండు వాహనాల మధ్య నుంచి దూసుకెళ్లడం వంటి చర్యలు రైడర్‌కే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి.సాహసం అనేది ప్రాణాలను పణంగా పెట్టడం కాదు.

## ట్రాఫిక్ సిగ్నల్.. అలంకారమా.?

ఎర్ర సిగ్నల్ పడినా పట్టించుకోకుండా వెళ్లే వాహనాలు కనిపిస్తే రోడ్డు భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయి. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ముగ్గురు ప్రయాణించడం, ఫోన్ చూస్తూ బైక్ నడపడం వంటి చర్యలు ప్రమాదాన్ని మరింత పెంచుతాయి.నిబంధనలు పాటించేది పోలీసుల భయంతో కాదు.. స్వీయ భద్రత కోసం అనే అవగాహన యువతలో పెరగాలి.

## తల్లిదండ్రులూ.. ఒక్కసారి ఆలోచించండి

మైనర్ పిల్లవాడు బైక్ నడుపుతుంటే అది కేవలం అతని సమస్య కాదు. ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం నష్టపోవాల్సి వస్తుంది. అంతేకాదు.. అతని నిర్లక్ష్యం వల్ల మరో కుటుంబం కూడా బాధితురాలయ్యే అవకాశం ఉంది.
అందుకే పిల్లలకు వాహనాలు ఇవ్వడం విషయంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలి. పాఠశాలలు, కళాశాలలు కూడా రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

## పోలీసు--రవాణా శాఖలదీ కీలక బాధ్యత

నిబంధనలు ఉన్నంత మాత్రాన సరిపోదు. వాటి అమలు నిరంతరం జరగాలి. ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థల పరిసరాలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాలు, రాత్రివేళల్లో యువత ఎక్కువగా తిరిగే మార్గాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.అక్రమ సైలెన్సర్లు, అతివేగం, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ ఉల్లంఘనలు వంటి అంశాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తే కొంతవరకు ప్రమాదాలను నియంత్రించవచ్చు.

## కఠిన చర్యలతోపాటు అవగాహనా అవసరం

ప్రతి సమస్యకు జరిమానానే పరిష్కారం కాదు. యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి. ట్రాఫిక్ నిబంధనలు ఎందుకు పాటించాలో వివరించాలి. ప్రమాదాల తీవ్రతను తెలియజేయాలి.(అదే సమయంలో ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పక ఉండాలి. ఒకరిపై చర్య తీసుకోవడం కంటే.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్య తప్పదనే నమ్మకం ఏర్పడాలి.

## రోడ్డు అందరిదీ.. బాధ్యత కూడా అందరిదే

బైక్ నడిపేవారు శత్రువులు కాదు. యువత కూడా సమాజంలో భాగమే. వారి ఉత్సాహం, వేగం, సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి ఉపయోగపడాలి. కానీ ఆ ఉత్సాహం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదు.సైలెన్సర్ శబ్దం తగ్గాలి.. రోడ్డు భద్రత పెరగాలి.వేగం తగ్గాలి.. బాధ్యత పెరగాలి.మైనర్ల చేతిలో బైక్ ఆగాలి.. తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరగాలి.రేసింగ్ మోజు తగ్గాలి.. ప్రాణాల విలువ పెరగాలి.ప్రజలకు ప్రశాంతంగా రోడ్లపై నడిచే హక్కు ఉంది. వాహనదారులకు సురక్షితంగా ప్రయాణించే హక్కు ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతే రోడ్డు భద్రతకు పునాది.కొత్త బైక్ కొనడం తప్పు కాదు. దానిని బాధ్యతగా నడపకపోవడమే తప్పు. సైలెన్సర్ మార్చుకోవడం వ్యక్తిగత అభిరుచి కావచ్చు.. కానీ దాని శబ్దం వందల కుటుంబాల ప్రశాంతతను భంగం చేస్తే అది ప్రజా సమస్యగా మారుతుంది.ఒక్క బైక్ వేగం.. ఒక కుటుంబం విషాదం కాకూడదు.ఒక్క సైలెన్సర్ శబ్దం.. వృద్ధుడి గుండె దడకు కారణం కాకూడదు.
ఒక్క మైనర్ నిర్లక్ష్యం.. రెండు కుటుంబాల జీవితాలను చీకట్లోకి నెట్టకూడదు.రోడ్డు మీదకు వచ్చే ప్రతి బైక్ వెనుక ఒక కుటుంబం ఉంది. ప్రతి పాదచారి వెనుక కూడా ఒక కుటుంబం ఉంది. అందుకే “నా బైక్.. నా ఇష్టం” అనే ధోరణికి బదులు “నా రోడ్డు.. నా బాధ్యత” అనే ఆలోచన రావాల్సిన సమయం ఇదే.

# బద్రుకా.. ఇదేం పని అయ్యా

**- చెట్లను కాపాడాలని విద్యార్థులకు పాఠాలు, - మరోవైపు పచ్చని చెట్ల నరికివేత**



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన విద్యాసంస్థే చెట్ల నరికివేతకు పాల్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ముత్తసంకల్ ప్రాంతంలో బద్రుకా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన ప్రాంగణంలో చెట్లను నరికిన ఘటనపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఒకవైపు పర్యావరణ పాఠాలు.. మరోవైపు చెట్ల నరికివేత

చెట్లు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి.. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలి అంటూ విద్యార్థులకు బోధించే విద్యాసంస్థల్లోనే చెట్ల సంరక్షణకు విరుద్ధంగా చర్యలు చోటుచేసుకోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందని, అలాంటి సంస్థలే పచ్చని చెట్ల విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.
చర్యలు తీసుకున్న అధికారులుచెట్ల నరికివేత వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చెట్టును నరికినందుకు రూ.15 వేల జరిమానా విధించినట్లు సమాచారం.అయితే కేవలం జరిమానాతో సరిపెట్టకుండా భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పచ్చదనం కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో చెట్ల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో ఉన్న చెట్లను సంరక్షించాల్సిన అవసరం మరింత పెరిగింది.

ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేయాలని ప్రజలు కోరుతున్నారు.“చెట్టు నాటడం మాత్రమే కాదు.. నాటిన చెట్టును కాపాడటం కూడా బాధ్యతే” అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని స్థానికులు సూచిస్తున్నారు.మేడ్చల్ మున్సిపాలిటీ అధికారిక వివరాల ప్రకారం పట్టణ పరిధి 26.95 చదరపు కిలోమీటర్లుగా ఉంది. పట్టణ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత అవసరం.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా
# నాగబాబు బాధ్యతలు

**- కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ పదవి**




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో కలిసి పాల్గొన్న ఆయన వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ‘ఏపీ గ్రీన్’ ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

**- ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్న తెలంగాణ ప్రజలు: ఎంపీ ఈటల



**హైదరాబాద్,** (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ ఫోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు.మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు.తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారు.రైల్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు.హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588